

గజదాడులకు మరో రైతు బలి

శోకసంద్రంగా కొత్తూరు - ఏనుగుల తిష్టతో బిక్కుబిక్కుమంటున్న గ్రామీణ జనం



గజ దాడుల విషయంలో న్యాయం కావాలంటూ శనివారం అర్ధరాత్రి దాటాక కూడా ధర్నా చేస్తున్న కొత్తూరు గ్రామస్తులు




రామకృష్ణమరాజు (ఫైల్ ఫొటో) - పొలంలో రామకృష్ణమరాజు మృతదేహం

పుంగనూరు/సోమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): మదపుటేనుగుల దాడిలో మరో రైతు ప్రాణాలు కోల్పోయాడు. పొలం వద్ద ఉన్న నీటి డ్రమ్ము ఇంటికి తెచ్చుకోవడానికి వెళ్లిన రైతుపై ఏనుగుల గుంపు దాడి చేసి హతమార్చిన సంఘటన శనివారం రాత్రి సోమల మండలంలో జరిగింది. ఆవులపల్లె పంచాయతీ కొత్తూరుకు చెందిన చెన్నూరి రామకృష్ణమరాజు అలియాస్ బాబు (46) గ్రామ సమీపంలోని పొలంలో టమోటా సాగు చేశాడు.మూడురోజులుగా ఆవులపల్లె పంచాయతీలో 16 ఏనుగుల గుంపు సంచరిస్తూ పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు త్వరగా పొలాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్నారు.శుక్రవారం రాత్రి రామకృష్ణమరాజు పొలంలోని కొబ్బరిచెట్లతో పాటు టమోటా తోటలో ఏనుగులు సంచరించి తొక్కినాశనం చేశాయి.రామకృష్ణమరాజు పొలంలో పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయడానికి ప్లాస్టిక్ డ్రమ్ము ఉంచాడు. ఏనుగులు తొక్కి నాశనం చేస్తాయోమోనని డ్రమ్మును ఇంటికి తీసుకురావడానికి రామకృష్ణమరాజు గ్రామానికి చెందిన సంజీవరాజు, రాజారెడ్డిలను తోడు పెట్టుకుని శనివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. డ్రమ్ములో నీటిని కింద పోస్తుండగా ఏనుగుల గుంపు దాడి చేసి కిందపడేసి తొక్కి చంపేసింది.ఏనుగుల ఘీంకారాలను గుర్తించిన రాజారెడ్డి, సంజీవరాజు భయంతో హుటాహుటిన ద్విచక్రవాహనంలో గ్రామానికి చేరుకుని సమాచారం ఇచ్చారు. రామకృష్ణమరాజు కుటుంబీకులతో పాటు గ్రామస్తులంతా కలసి సంఘటనా స్థలానికి వెళ్లారు.రామకృష్ణమరాజు మృతదేహం వద్దే ఏనుగుల గుంపు తచ్చాడడం చూసి భయంతో వెనుదిరిగారు.అటవీ, పోలీసు శాఖలకు సర్పంచ్ కోదండరాజు సమాచారం ఇవ్వడంతో రాత్రి 8.30 గంటలకు వారు కొత్తూరుకు చేరుకున్నారు. ఆవులపల్లె, ఎగువకొత్తూరు, పత్రపల్లె, గాంధీనగర్ తదితర ప్రాంతాల రైతులు ఈ సమాచారం తెలుసుకుని కొత్తూరు చేరుకున్నారు. ఏనుగుల గుంపును తరిమేందుకు టపాసులు, డప్పులను వాయిస్తూ, లైట్లు వేస్తూ కేకలు పెట్టారు. రాత్రి 10 గంటల సమయంలో ఏనుగులు వెళ్లిపోవడంతో రామకృష్ణమరాజు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు.రామకృష్ణమరాజు మృతితో ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు తమకింక దిక్కెవరని రోదించడం చూసి గ్రామస్తులు కూడా కళ్లనీళ్లు పెట్టుకున్నారు.

కొత్తూరులో ఉద్రిక్తత

గజ దాడుల విషయంలో తమకు న్యాయం కావాలంటూ రామకృష్ణమరాజు మృతదేహంతో కొత్తూరు గ్రామస్తులు శనివారం రాత్రి 11 గంటలకు ధర్నాకు దిగడంతో సోమల మండలం కొత్తూరులో ఉద్రిక్తత నెలకొంది.రామకృష్ణమరాజు మృతి విషయంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతు చనిపోయారని తెలిసి కూడా అటవీశాఖ అధికారులు సంఘటనా ప్రాంతానికి ఆలస్యంగా వచ్చారని విమర్శించారు.ఒక జంతువు చనిపోతే హడావుడి చేసే ఫారెస్టు అధికారులు ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని దుయ్యబట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించనీయకుండా రోడ్డుపై పెట్టి నిరసన వ్యక్తం చేశారు.కొత్తూరుకు కలెక్టర్, డిప్యూటీ సీఎం వచ్చి ఏనుగుల నుంచి రక్షణ కల్పించే వరకూ మృతదేహాన్ని రోడ్డుపై నుంచి తీయబోమని హెచ్చరించారు. ఏనుగులతో దాదాపు పదేళ్లుగా తాము ఇబ్బంది పడుతుంటే, రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న అధికారులు మాత్రం రైతుల గురించి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాత్రి 12.30 గంటలకు కూడా ఈధర్నా కొనసాగుతూనే ఉంది.

ఏనుగుల దాడిలో టమోటా రైతు రామకృష్ణమరాజు మృతి చెందడం దురదృష్టకరమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. శనివారం రాత్రి ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గంలో ఏనుగులు పంటలను నాశనం చేయడమే కాక రైతుల ప్రాణాలు కూడా బలిగొంటున్నాయన్న విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్

ఏనుగుల కట్టడికి చర్యలు : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. రామకృష్ణమరాజు కుటుంబాన్ని ఆదుకొనే విషయమై కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు.అటవీశాఖ అధికారులు కూడా ఏనుగులను కట్టడి చేస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ విషయంపై పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ ఏనుగుల దాడిలో మృతి చెందిన రామకృష్ణమరాజు కుటుంబాన్ని ఆదుకోవడానికి కృషి చేస్తానని తెలిపారు.

బాబు బాటలో టీడీపీ నేతలు

● రామకుప్పంలో 25 బంగారు కుటుంబాల దత్తత

రామకుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు చేసిన ప్రకటనతో రామకుప్పం మండల టీడీపీ నేతలు సైతం బంగారు కుటుంబాల దత్తతకు ముందుకొచ్చారు.బందార్లపల్లె పంచాయతీలో 25 బంగారు కుటుంబాలను తాను దత్తత తీసుకుంటున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి శనివారం ప్రకటించారు. అదే విధంగా తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగులోని 10 కుటుంబాలను, పీఏసీఎస్ చైర్మన్ మహ్మద్‌రఫీ గొరివిమాకులపల్లె పంచాయతీలోని 10 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు.

చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో అసెస్‌మెంట్ల పరిశీలన

చిత్తూరు అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో శనివారం అసెస్‌మెంట్ల పరిశీలన జరిగింది. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఈ అసెస్‌మెంట్ల పరిశీలన కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన అడ్మిన్ సెక్రటరీలు, ఆర్‌ఐలు, ఆర్వోలు ఈ పరిశీలనలో పాల్గొన్నారు. గతంలో కన్నా ఇప్పుడు అసెస్‌మెంట్ల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోవడంతో ప్రభుత్వం అసెస్‌మెంట్లను రీవెరిఫికేషన్ చేయాలని ఆదేశించింది.దీంతో తిరుపతికి చెందిన సిబ్బంది చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 179 అసెస్‌మెంట్లకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. గత మూడ్రోజులుగా రికార్డులను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి పరిశీలిస్తున్నారు. గత ప్రభుత్వం విద్యార్థులతో అసెస్‌మెంట్లను రికార్డు చేయమని చెప్పగా.. గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ ఉన్నప్పటికీ సెకండ్ ఫ్లోర్ ఉన్నట్లు ట్యాక్స్ వేశారని, అదే విధంగా భాగ పరిష్కారంలోనూ పొరబాట్లు గుర్తించినట్లు పరిశీలన అధికారులు తెలిపారు.




చిరునవ్వులు చిందిస్తున్న హీరోయిన్ భాగ్యశ్రీ

వెంకన్న దయతలిస్తే

టాప్‌లో కూర్చుంటా!

'కింగ్‌డమ్' వేడుకలో హీరో విజయ్ దేవరకొండ

తిరుపతి అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తిరుమల ఏడుకొండలస్వామి నా పక్కన వుండి నడిపిస్తే పోయి టాప్‌లో కూర్చుంటానని యువ హీరో విజయ్ దేవరకొండ అన్నారు.ఆయన హీరోగా నటించిన 'కింగ్‌డమ్' సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం శనివారం రాత్రి తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రతిసారిలాగే ఈ సినిమాకు కూడా ప్రాణంపెట్టి గట్టిగా పనిచేశాం. ఇక మిగిలింది ఆ వెంకన్నస్వామి దయ, మీ అందరి ఆశీస్సులు.ఈ రెండూ నా వెంటవుంటే నన్ను ఎవరూ ఆపలేరు.సినిమా విడుదల రోజైన 31న థియేటర్‌లో మిమ్మల్ని మళ్లీ కలుస్తా, అప్పటి వరకు బాగా చూసుకో స్వామీ, ఏడుకొండలవాడా గోవిందా గోవిందా' అని చిత్తూరు యాసలో మాట్లాడుతూ యువతను ఆకట్టుకున్నారు. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ 'తిరుపతి నాకు చాలా స్పెషల్, ఇక్కడికి వస్తేనే పాజిటివ్ ఫీలింగ్ వస్తుంది, చేసింది ఒక్క సినిమానే అయినా మీరంతా నామీద చూపిస్తున్న ప్రేమ మరువలేను' అన్నారు. చక్కటి టీం వర్కుతో పనిచేశామని, కింగ్‌డం సినిమా ఆద్యంతం అలరిస్తుందని చెప్పుకొచ్చారు.క్లాస్, మాస్ వాతావరణంలో జరిగిన ట్రైలర్ రిలీజ్ మధురానుభూతినిచ్చిందన్నారు.అంతకు ముందు మూవీ ట్రైలర్ రిలీజ్ చేయగానే కుర్రకారు లేచినిలబడి కేరింతలు కొడుతూ సందడి చేశారు.యువత ఉత్సాహం మితిమీరడంతో పోలీసులు రంగంలోకి దిగి అదుపుచేశారు.దర్శకుడు గౌతమ్‌తిన్ననూరి, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత నాగవంశీ తదితరులు పాల్గొన్నారు. కాగా గతంలో గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హీరో విజయ్ దేవరకొండను అరెస్టు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ ప్రతినిధులు మైదానం వెలుపల ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.



ప్రేక్షకులకు నమస్కరిస్తున్న విజయ్





తిరుమలలో చిరుత సంచారం

తిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం చిరుత సంచారం కలకలం సృష్టించింది. తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌కు సమీపంలోని బ్యాటరీ స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఓ చిరుత వాహనదారుల కంటపడింది. దీంతో భయభ్రాంతులకు గురైన వారు సమీపంలోని విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారిద్వారా ఫారెస్ట్ అధికారులు విషయం తెలుసుకుని ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే చిరుత అడవిలోకి వెళ్లిపోయింది. అయినప్పటికీ సమీపంలో చిరుత ఉంటే అడవిలోకి వెళ్లిపోయేలా సైరన్లు వేశారు. అలాగే వాహనదారులను, స్థానికులను అప్రమత్తం చేశారు.



పార్టీ ప్రతిష్టను దిగజార్చితే సహించేది లేదు

● టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్



మీడియా సమావేశంలో టీడీపీ నేతలతో సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ ప్రతిష్టను దిగజార్చే విధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేదిలేదని టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్ పార్టీ శ్రేణులను హెచ్చరించారు. గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ పీఏ చంద్రశేఖర్ తీరుపై నియోజకవర్గంలోని కొందరు నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంపై ఆయన స్పందించారు. శనివారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేతల మధ్య ఏవైనా సమస్యలు, మనస్పర్థలుంటే పార్టీ పెద్దల సమక్షంలో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పారు. అలాకాకుండా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుని అధికారులకు ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయంలో నేతలు సంయమనం పాటించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే పీఏ ఏవైనా తప్పులు చేసినట్లు ఆధారాలుంటే తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యేతో మాట్లాడడం జరిగిందని నియోజకవర్గంలోని నేతలందరితో సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని ఆయన చెప్పారని తెలిపారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నాగేశ్వరరావు, రుద్రప్ప, ఇందిరమ్మ, జయశంకర్ నాయుడు, చెంగల్రాయ యాదవ్, శ్రీధర్ యాదవ్, లోకనాథ రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో హోంమంత్రి అనిత





పద్మావతీ అమ్మవారి ఆలయంలో హోంమంత్రి అనిత - శ్రీవారి ఆలయం వద్ద నిరోషా

తిరుమల శ్రీవారిని శనివారం రాష్ట్ర హోంమంత్రి అనిత దర్శించుకున్నారు. ఇంకా ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, సినీనటి నిరోషా, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయ్ జాకీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు హోంమంత్రి అనిత శ్రీకాళహస్తీశ్వరుడిని, పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. నిరోషా పరశురామేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముక్కంటి ఆలయంలో పాము కలకలం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోకి పాము చొరబడటంతో కలకలం రేగింది. ఆలయంలోని రూ.750 రాహుకేతు పూజా మండపం వద్ద శనివారం సాయంత్రం భారీ జెర్రిపోతు పూజా సామగ్రి మూటల వద్ద కనిపించింది. దీంతో భక్తులు ఉలిక్కిపడ్డారు. ఆలయాధికారులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ శాఖ ఉద్యోగి దాము ఆలయం వద్దకు చేరుకుని పామును పట్టుకుని కైలాసగిరి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

పామును పట్టుకుంటున్న దాము




సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.4.23 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,576

తలనీలాలు సమర్పించినవారు: 25,227





సాగులో 'డ్రోనాస్త్రం'

- అన్నదాతకు అన్నింటా వెన్నుదన్నుగా డ్రోన్
- 80శాతం సబ్సిడీతో అందజేస్తున్న ప్రభుత్వం
- వ్యవసాయంలో ఇప్పుడీ పరికరానిదే కీలకపాత్ర

వ్యవసాయంపై అన్నదాత పెదవి విరుస్తున్న క్రమంలో ఆధునిక సాంకేతికత ఓ తీయని కబురందించింది. ఎగిరే ఓ అద్భుత యంత్ర పరికరాన్ని రూపొందించి అండగా నిలిచింది. దీన్ని అందిపుచ్చుకుంటే సాగులో లాభాలు పొందవచ్చునని భరోసా ఇచ్చింది. కూలీలు దొరకలేదని, ఖర్చు పెరుగుతోందని డీలా పడుతున్న రైతులకు డ్రోన్ రూపంలో చేదోడువాదోడుగా ఉంటోంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తున్న రైతు

డ్రోన్ల ప్రవేశంతో వ్యవసాయం తీరు మారింది. నైరాశ్యంలో కొట్టుమిట్టాడే రైతన్నలకు ఇది కొండంత అండగా నిలిచింది. సాగులో ఎదుర్కొంటున్న పలు సమస్యలకు చక్కని పరిష్కారం చూపుతోంది. పదిమంది కూలీలు చేసే పనిని తానొక్కటే చేసి చూపిస్తూ అన్నదాతకు ఆసరా అవుతోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ రంగాన్ని ఊపందించేందుకు డ్రోన్లను ప్రభుత్వం కారుచౌకగా అందిస్తోంది. రైతులు కూడా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఫలితంగా జిల్లాలో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. పెట్టుబడి భారాన్ని తగ్గించుకుంటూ నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో సఫలీకృతమవుతున్నారు.



ఆగస్టు నుంచి మరిన్ని డ్రోన్లు

జిల్లాలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.52 కోట్లు వెచ్చించి 36డ్రోన్లను పంపిణీ చేసింది. సబ్సిడీ కింద రూ.2.82కోట్లు చెల్లించింది. డ్రోన్ల వినియోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన వచ్చింది. డ్రోన్లపై కొంతమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆగస్టు నుంచి మరిన్ని కేటాయించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాశాఖాధికారి



సబ్సిడీ కింద రైతులకు డ్రోన్లు అందిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

పిచికారీలో ప్రధాన పాత్ర

జిల్లాలో ప్రతి మండలానికీ 80శాతం రాయితీతో ప్రభుత్వం డ్రోన్లు మంజూరు చేసింది. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో వీటిని ఇప్పటికే అందజేసింది. మారుమూల గ్రామీణ ప్రాంత రైతులు సైతం ఇప్పుడు డ్రోన్ల సాయంతో సాగులో చకచకా దూసుకుపోతున్నారు. సమయం ఆదాతోపాటు పెట్టుబడీ తగ్గుతుండటంతో డ్రోన్ల వ్యవస్థపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

డ్రోన్ కావాలంటే ఇలా చేయాలి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం నీరుగారింది. మందు పిచికారీ చేయాలంటే డ్రోన్‌ను అద్దెకు తీసుకోవాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక డ్రోన్ల వ్యవస్థను బలోపేతం చేయాలని సంకల్పించింది. కనీసం ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడితే చాలు. పదవ తరగతి లేదా ఐటీఐ చదివి డీజీసీఏ నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు ఉండాలి. గ్రూప్‌లోని ఒక రైతుకు డ్రోన్ వినియోగంపై 12రోజుల పాటు గుంటూరులో శిక్షణ ఇస్తారు. డ్రోన్ ఖరీదు రూ.9.80లక్షలు. ఇందులో రైతుల సంఘం రూ.2లక్షలు చెల్లిస్తే మిగతా రూ.7.84 లక్షలు బ్యాంకు రుణంగా సమకూర్చుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం 80శాతం రాయితీ కింద 7.84లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది.



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



సమయం ఆదా అవుతోంది

ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్‌లను అందజేస్తుండటం శుభపరిణామం. నాకు 20 ఎకరాల పొలముంది. గతంలో ఎకరాకు 200లీటర్లు నీరు నింపి పవర్‌స్ప్రే ద్వారా రెండు గంటల పాటు మందు పిచికారీ చేయాల్సి వచ్చేది. డ్రోన్ ద్వారా ఎకరాకు 10 లీటర్ల పురుగుల మందును 8 నిమిషాల్లోనే స్ప్రే చేస్తున్నాం. సమయం ఆదాతోపాటు కూలీల కొరత కూడా తీరింది.

- మస్తాన్ బిలాల్, రైతు, కల్లూరు గ్రామం, డీవీసత్రం



సాగు ఖర్చు తగ్గింది

నాకు 60 ఎకరాల పొలం ఉంది. సంవత్సరంలో రెండుసార్లు పంట పండిస్తాం.డ్రోన్ సాయంతో సమయం ఆదా అవుతోంది. ఖర్చు కూడా తగ్గుతోంది. కొన్ని దీర్ఘకాలిక తెగుళ్లకు డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ చేయడంతో దిగుబడి పెరిగింది. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- చంద్రశేఖర్, రైతు, సత్యవేడు



అధిక దిగుబడి సాధిస్తున్నాం

మాకు 16 ఎకరాల పొలం ఉంది. ఇద్దరు వ్యక్తులు రోజుకు ఐదెకరాల్లో పురుగుల మందు పిచికారీ చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో మాకు డ్రోన్లు ఇవ్వడంతో తక్కువ సమయంలోనే పిచికారీ చేస్తున్నాం. డ్రోన్‌తో స్ప్రే చేయడం వల్ల ప్రతి ఆకుపై నేరుగా మందు పడుతోంది. దీంతో అధిక దిగుబడి సాధిస్తున్నాం.

- ప్రేమ్‌కుమార్, రైతు, చిన్నకనపర్తి, తొట్టంబేడు మండలం.



వరి, మామిడిపై మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

రైతులను పట్టించుకోవడం లేదు

- కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతుల బాధలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, రాజ్యసభ మాజీ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, మిర్చి, పొగాకు, మామిడి, చీనీ, పసుపు ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. పంట కొనేవారే కరువయ్యారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదన్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉందని, కాంప్లెక్సు ఎరువుల ధరలు అమాంతంగా పెరిగాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతుకు రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినా 14 నెలలు కావస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తే రాష్ట్రం వాటిని వేరే కార్యక్రమాలకు మళ్లించారని ఆరోపించారు. వైసీపీ, టీడీపీ దొందూదొందేనని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి నగర అధ్యక్షుడు చిట్టిబాబు, పీసీసీ కార్యదర్శి వెంకట నరసింహులు, నాయకులు చంద్రశేఖర్, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పారెడ్డిపాళెంలో తమిళనాడు పోలీసుల విచారణ



దొరవారిసత్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆరంబాకంలో ఐదేళ్ల బాలికపై ఈనెల 12న లైంగిక దాడికి పాల్పడిన అసోం రాష్ట్రానికి చెందిన రాజ్ విశ్వకర్మను శుక్రవారం సూళ్లూరుపేటలో తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసు విచారణలో భాగంగా రాజ్ విశ్వకర్మను వెంట బెట్టుకుని ఆరంబాకం పోలీసులు శనివారం దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళానికి వచ్చారు. అక్కడ హైవే పక్కన గల డాబాలో నిందితుడు పనిచేస్తున్నట్లు విచారణలో చెప్పడంతో దాన్ని పరిశీలించి, చుట్టుపక్కల వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అతని కుటుంబ వివరాలు కూడా సేకరిస్తున్నారు.

రైలులో నుంచి పడి కానిస్టేబుల్ మృతి



అశోక్ మృతదేహం

వెంకటగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి పడి కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున వెంకటగిరి - గూడూరు రైలు మార్గంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. డక్కిలి మండలం సంఘనపల్లి గ్రామానికి చెందిన ఎస్.అశోక్(35) వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులకు హాజరయ్యే నిమిత్తం గూడూరు నుంచి రైలులో వెంకటగిరికి బయలుదేరాడు. వెంకటగిరి సమీపంలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే కీమెన్ గుర్తించి గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని గూడూరుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉవ్వెత్తున ఎగసిన 'గంగ'

- మంగళంలో ఊడిపోయిన తెలుగుగంగ పైపులైన్ ఎయిర్‌వాల్వ్

తిరుపతి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరశివారు ప్రాంతం మంగళంలోని తిరుమలనగర్‌కు వెళ్లే మలుపు వద్ద శనివారం మధ్యాహ్నం తెలుగుగంగ పైపులైన్ ఎయిర్‌వాల్వ్ ఊడిపోయింది. నీరు దాదాపు 10 మీటర్ల ఎత్తు ఎగసిపడ్డాయి. మూడుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పంపింగ్‌స్టేషన్ నుంచి ఫిల్టర్‌హౌస్‌కు సరఫరా అవుతున్న రా వాటర్ స్తంభించింది. ఫిల్టర్‌హౌస్ ఎత్తులో ఉండడంతో నీరు ఒక్కసారిగా వెనక్కి తన్నింది. దీంతో కరకంబాడీ ప్రధాన రహదారి పక్కనున్న ఎయిర్ వాల్వ్ ఊడిపోయింది. పైపు నుంచి నీరు ఒక్కసారిగా ఉప్పొంగింది. పది మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడుతూ పక్కనే ఉన్న నివాసం మీదకు పడ్డాయి. కిటికీ నుంచి లోపలికి నీరుచేరడంతో ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. ప్రవాహ ఉధృతికి ఇంటిపైనున్న ట్యాంకు పైపులు పగిలిపోయాయి. చెత్తనిల్వ చేసే సిమెంట్ కట్టడం కూలిపోయింది. ఇంతలో పంపింగ్‌స్టేషన్‌లో గేటువాల్వ్ ఓపెన్ చేయడంతో నీటి ఉధృతి తగ్గింది. అప్పటికే లక్షల గ్యాలన్ల నీరు వృథా అయ్యాయి. తెలుగుగంగ ఏఈ పవన్‌కుమార్ రెడ్డి అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ అంతరాయం మూలాన జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.





ఊడిపోయిన తెలుగంగ పైపు ఎయిర్‌వాల్వ్ - ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న నీరు

గన్‌మెన్లతో సామాన్లు మోయించడం ఏమిటీ...?

- పెద్దిరెడ్డి తీరుపై హోంమంత్రి అనిత పరోక్ష వ్యాఖ్యలు

తిరుచానూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'ఎంతో శిక్షణ పొంది మన రక్షణ కోసం వచ్చిన గన్‌మెన్ల వద్ద సామాన్లు మోయించడం ఏమిటి..? గన్‌మెన్ అంటే మీ ఇంట్లో పనిచేసేవారు కాదుకదా... ఎవరి పనులు వారు స్వతంత్రంగా చేసుకోనివ్వండి' అంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై హోంమంత్రి అనిత పరోక్షంగా వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్నను, తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని ఆమె శనివారం దర్శించుకున్నారు.తిరుచానూరు ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గన్‌మెన్ అనేవారు వ్యక్తిగత భద్రత కోసమేనని, అలాంటి వారిని వ్యక్తిగత పనుల కోసం వాడుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.తనకు గొడుగు పట్టుకుని వస్తే కూడా ఒప్పుకోనన్నారు. కూటమి ప్రభుత్వంలో నిజాయితీగా పనిచేసుకోవచ్చన్నారు. లిక్కర్ స్కామ్ విచారణ వేగవంతంగా జరుగుతోందని, దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదన్నారు.ఎమ్మెల్యేలపై రోజా చేసిన వ్యాఖ్యలపై అనిత స్పందిస్తూ నాయకులు ఆదర్శంగా ఉండాలని, ఫ్రస్ట్రేషన్ తట్టుకోలేక నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. సభ్యత, సంస్కారం లేనివారి గురించి మాట్లాడడం అంటే సమయం వృథా అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కరెక్ట్‌గా ఉందన్నారు. క్రైమ్ రేటు కూడా తగ్గిందన్నారు.పోలీసుశాఖలో డ్రోన్ కెమెరాల వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు.



తిరుమల ఆలయం వద్ద హోంమంత్రి అనిత

క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో వైద్యం

తిరుపతి(వైద్యం), జూలై 26(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందించేందుకు టాటా క్యాన్సర్ ట్రస్టు అన్ని విధాలా కృషి చేస్తోందని టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ అన్నారు. జూపార్కు రోడ్డులోని టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో శనివారం జాతీయ క్యాన్సర్ గ్రిడ్ - ఏపీ స్టేట్ ఛాప్టర్ 3వ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ ఆస్పత్రులు, పరిశోధన సంస్థలు, సేవా సంస్థలతో కలిసి 2012లో టాటా మెమోరియల్ సెంటర్ ఎన్‌సీజీ(జాతీయ క్యాన్సర్ గ్రిడ్)ను స్థాపించిందన్నారు. క్యాన్సర్‌ను గుర్తించడం, అవసరమైన వైద్యం అందించడం, నివారించడం ఎన్‌సీజీ లక్ష్యమన్నారు. క్యాన్సర్‌ను సమూలంగా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వర్చువల్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వివరించారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి హాజరైన క్యాన్సర్ వైద్య నిపుణులు వారి అనుభవాలను, అభిప్రాయాలను వివరించారు.

104 వాహనం ఢీకొని రైతు మృతి



సుబ్రహ్మణ్యంరెడ్డి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 104 వాహనం ఢీకొని రైతు మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు వద్ద శనివారం చోటుచేసుకుంది. ముచ్చివోలు గ్రామానికి చెందిన పి.సుబ్రహ్మణ్యంరెడ్డి(49) ఆదివారం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఉత్సవం, ఊరేగింపు ఉండడంతో సరుకుల కోసం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వచ్చాడు. సరుకులను ఆటోలో వేసి బైక్‌లో తిరిగి వెళుతుండగా ఉడమలపాడు వద్ద ద్విచక్ర వాహనాన్ని 104 ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాఠశాల విలీనంపై ఆగ్రహం

- టీచర్లను చుట్టుముట్టిన గ్రామస్తులు



కేవీబీపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని అనంతపద్మనాభపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు చుట్టుముట్టారు. అనంతపద్మనాభపురం విద్యార్థులను విలీనం పేరుతో పక్కనున్న గుంటిపేడు గ్రామానికి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు సూచించగా అందుకు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళం వేసి నిరసన తెలుపుతున్నారు. ఉపాధ్యాయులు రోజూ వచ్చి పాఠశాల బయట కూర్చుని వెళ్లిపోతున్నారు. తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలని ఎంఈవో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో శనివారం ఉపాధ్యాయులు పాఠశాల తాళం తీయడంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు ఇద్దరు ఉపాధ్యాయులను చుట్టుముట్టారు. తమ పిల్లలకు చదువు లేకపోయినా పర్వాలేదు గాని వేరే పాఠశాలకు పంపేది లేదని తెగేసి చెప్పారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌బాబు అక్కడికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి, టీచర్లను అక్కడి నుంచి పంపించారు. సోమవారం నుంచి పాఠశాలకు రావద్దని గ్రామస్తులు ఉపాధ్యాయులను హెచ్చరించారు.

ఉచిత ప్రయాణంపై 30న ఆర్టీసీ ఉన్నతస్థాయి సమావేశం

తిరుపతి(ఆర్టీసీ),జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 30న తిరుపతిలో ఆర్టీసీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనుంది. ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం తిరుపతికి చేరుకోనున్నారు. స్థానిక విద్యాపీఠం కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం కానున్నారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం సంబంధించిన డీపీటీవోలు, డిప్యూటీ సీటీఎంలు, సీఎంఈలు, పీవో, ఇతర అధికారులు, 54 డిపోల మేనేజర్లు హాజరు కావాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



తైవాన్ ప్రతినిధులకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న శివశంకర్

శ్రీసిటీలో తైవాన్ వ్యాపార ప్రతినిధుల బృందం

సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్‌కి చెందిన 14మంది వ్యాపార ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీదారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాక్స్‌లిన్ నేతృత్వంలో విచ్చేసిన ఈ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, శ్రీసిటీ తరఫున మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. తైవాన్‌కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్‌తో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేసిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు వికాస్ మర్మత్, రంజిత్, గీతాంజలి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి మనీష్‌తివారీతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య ముఖ్య కార్యదర్శి డాక్టర్ యువరాజ్ వర్చువల్‌గా తైవాన్ బృందంతో చర్చించారు.

ఇద్దరు ఎర్రచందనం దొంగల అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం నిందితులు

ఎర్రావారిపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి); ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. తలకోన సెంట్రల్ బీట్ పరిధిలోని దద్దిలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దొంగలు ఉన్నట్లు ముందస్తు సమాచారం అందింది. ఈ మేరకు అటవీ శాఖ సిబ్బంది శనివారం కూంబింగ్ నిర్వహించారు. వీరికి 9మంది ఎర్రచందనం దొంగలు తారసపడ్డారు. పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు దొరికారు. మిగిలిన వారు పరారయ్యారు. పట్టుబడిన వారిని సోమల మండలం అన్నెంగారిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన వీరప్ప, శివయ్యలుగా గుర్తించారు. సంఘటన స్థలంలో రెండు ద్విచక్ర వాహనాలతో పాటు 311 కేజీల బరువున్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వెంకటరమణ తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ రూ.13 లక్షలు ఉంటుందన్నారు. దాడిలో అధికారులు ప్రదీప్, సల్లావుద్దీన్, రాజేష్ కుమార్, డ్రైవర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరులకు నివాళి



సుబేదార్ హరికృష్ణారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు సెంట్రల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ శనివారం చిత్తూరులోని కార్గిల్ స్థూపం వద్ద నివాళి అర్పించి, పలువురు మాజీ సైనికులను సన్మానించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న చిత్తూరు వాసి సుబేదార్ హరికృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, రవికుమార్, సత్యభామ, సి.బాబు, రెహమాన్, సురేష్, లితిలష్, షణ్ముగం, సత్య, పూర్ణచంద్ర, రామభద్ర, తదితరులు పాల్గొన్నారు. కాగా, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్, కార్యదర్శి రఘు, డివిజన్ అధ్యక్షుడు పళని ఆధ్వర్యంలోనూ మాజీ సైనికులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ రాఘవులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్లో మోటరు సైకిల్ రైడింగ్ పోటీలు





పోటీదారులకు సూచనలిస్తున్న ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ - పోటీల్లో పాల్గొన్న పోలీసుశాఖ సిబ్బంది

చిత్తూరు అర్బన్, జూలై 26 (ఆంధ్రజోతి): స్లో మోటరు సైకిల్ రైడింగ్ పోటీలను శనివారం స్థానిక సాయుధ దళం కార్యాలయంలోని పరేడ్ మైదానంలో పోలీసుశాఖ సిబ్బందికి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను డీఎస్పీ సాయినాథ్ శనివారం ప్రారంభించారు. 40మంది పాల్గొని రెండో రౌండ్‌కు ఎంపికయ్యారు. ఇదివరకు రిజిస్టర్ చేసుకున్న జిల్లా ప్రజలకు ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. అర్హత సాధించిన వారికి పోలీసు సిబ్బందితో కలిపి రెండో రౌండ్‌ను నిర్వహించి.. విజేతలకు ఎస్పీ మణికంఠ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

పోటీ జరిగేదిలా..

వంద మీటర్ల దూరాన్ని కాలు కింద పెట్టకుండా స్లో మోటర్ సైకిల్ రైడింగ్ చేస్తారో వారిని విజేతగా ప్రకటిస్తారు. ప్రతి బ్యాచ్‌లో కొంత మందిని అనుమతించి పోటీలు నిర్వహిస్తారు. మొదటి రౌండ్‌లోని అన్ని బ్యాచ్‌లలో విన్నర్లను రెండో రౌండ్‌కు పంపుతారు. వచ్చిన పోటీదారులను అనుసరించి రౌండ్ల సంఖ్యను నిర్ధారిస్తారు. చివరి రౌండ్‌లో ఒకటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను ఇస్తారు. విజయం విద్యా సంస్థల సౌజన్యంతో మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలను, ట్రోఫీలను ఇవ్వనున్నారు.

ఢిల్లీలో స్వాతంత్ర్య దిన వేడుకలకు రండి

కొత్తపల్లె సర్పంచ్‌కు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సర్పంచ్‌కు అరుదైన ఆహ్వానం అందింది. వచ్చే నెల ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనడానికి కుప్పం మండలం కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కె.రాజశేఖర్‌కు ఆహ్వానం అందింది. రాష్ట్రవ్యాప్తంగా పది మంది సర్పంచ్‌లకు అవకాశం కల్పించగా, ఇందులో జిల్లా నుంచి రాజశేఖర్ ఉన్నారు. జీవిత భాగస్వామితో కలిసి రావాలని ఆహ్వానంలో పేర్కొన్నారు. వీరికి ఢిల్లీకి రానుపోను రవాణా ఖర్చులతోపాటు అక్కడ వసతి సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పిస్తుంది. సర్పంచ్ వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ.. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పంపారు. రాజశేఖర్ సర్పంచ్‌గా కొత్తపల్లె పంచాయతీలోని అన్ని ఇళ్లకు తాగునీటి కొళాయి వసతి కల్పించారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా బలహీన కుటుంబాలకు రుణ సదుపాయం, తదితర సౌకర్యాలను కల్పించిన కారణంగా ఈ వేడుకలకు ఎంపికయ్యారు.

'ఆశా కార్యకర్తల' ఇంటర్వ్యూలకు 142 మంది హాజరు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల ఉద్యోగాలకు శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 142 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 69 పోస్టులకు 174మంది దరఖాస్తు చేసుకున్నారని డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో రెండ్రోజుల్లో ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామన్నారు. నోడల్ అధికారి హనుమంతరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూవిభజనకు డిసెంబరు వరకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకునేందుకు డిసెంబరు 31వ తేదీవరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు జేసీ విద్యాధరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూవిభజన కోసం సాధారణంగా వసూలుచేసే రూ. 500 రుసుంను ప్రభుత్వం మాఫీ చేసిందని, రూ.50 నామమాత్రపు దరఖాస్తు రుసుం చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఇందుకోసం సచివాలయాల్లో నిర్దేశిత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాయింట్ పట్టాదారులు తమ భూములను విడిగా నమోదుచేసుకుని తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందవచ్చన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



ఆలయంలో చంద్రప్రకాష్ గోయల్, శ్రీనివాస్, శ్రీధర్, సెల్వం

ఐరాల(కాణిపాకం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అటవీశాఖ కన్జర్వేటర్లు శ్రీధర్, సెల్వంలు శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు. డీఎఫ్‌వో భరణి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, కాణిపాకం ఇన్‌చార్జి ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నాటుబాంబు పేలి ఆవు మృతి


● మామిడితోటలో 19 నాటు బాంబుల స్వాధీనం



తీవ్రంగా గాయపడిన ఆవు

కల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం 102 ఈ రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ చిగురమాకులపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో శనివారం సాయంత్రం నాటు బాంబు పేలడంతో ఆవు మృతి చెందింది. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు... చిగురమాకులపల్లికి చెందిన పాడి రైతు మల్లికార్జున ఆవును మేపుకునేందుకు గ్రామానికి సమీపంలోని ఓ మామిడితోట వద్దకు తోలుకెళ్లాడు. మామిడితోటలో అడవి పందుల కోసం అమర్చిన నాటుబాంబును ఆవు కొరకడంతో ఒక్కసారిగా పెద్ద శబ్ధం వచ్చింది. దీంతో రైతు మల్లికార్జున పరిశీలించగా ఆవుకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అడవి పందుల కోసం నాటుబాంబు అమర్చిన వ్యక్తి గురించి పోలీసులు ఆరా తీశారు. ఇదే గ్రామానికి చెందిన కృష్ణమాచారి (65)గా గుర్తించి అతడి వద్ద ఉన్న 19 నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా శనివారం రాత్రి సమయంలో ఆవు మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. కృష్ణమాచారి, ఆయన కుమారుడు మునిసుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐటీసీతో కుప్పం మున్సిపాలిటీ ఒప్పందం



ఎస్జీఎస్ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం శనివారం ఐటీసీ తరపున అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ (ఎస్జీఎస్) స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులలో ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్తను వేరుచేసే ప్రక్రియను ఎస్జీఎస్ చేపడుతుంది. చెత్త నిర్వహణకు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగిస్తుంది. తడి పొడి చెత్తలను వేర్వేరు చేసేలా వారిని ప్రోత్సహించి ఆరోగ్యకరమైన శుభ్రమైన స్వచ్ఛ కుప్పం లక్ష్య సాధనకు సహకరిస్తుంది. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఎస్జీఎస్ ఈడీ బాలకృష్ణమూర్తిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ అంజనేయులు, ఎస్జీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రాకుంటే సమస్యలెవరికి చెప్పుకోవాలి?

గైర్హాజరైన జిల్లా అధికారులకు నోటీసులు ఇవ్వండి

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్మన్ , సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశాలకు జిల్లాస్థాయి అధికారులు రావడంలేదని, హెచ్చరించినా కొందరి తీరు మారడం లేదని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులతో పాటు పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో పాటు సభ్యులు తాము పనిలేక సమావేశాలకు వస్తున్నామా అంటూ ధ్వజమెత్తారు.అధికారులు రాకపోతే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన అధికారులైతే ముందు నుంచి కూడా సమావేశాలకు హాజరు కావడం లేదని, ఆయా జిల్లాలకు చెందిన సభ్యులు జడ్పీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.గత మూడు సమావేశాలకు హాజరు కాని తిరుపతి ఐసీడీఎస్ అధికారికి నోటీసులు ఇవ్వాలని జడ్పీ చైర్మన్ ఆదేశించారు. అలాగే సమావేశానికి రాని జిల్లా స్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం మొదలైందని.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ వర్కులు పూర్తి చేయాలని డీపీవోను ఆదేశించారు.గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ నిర్వాహకులకు నిధులున్నా వేతనాలను ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. వీధి లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్న కారణంగా పంచాయతీలపై విద్యుత్ భారం పడుతోందని వెంటనే వాటికి స్విచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఏనుగుల దాడుల నివారణకు కలెక్టర్ అభ్యర్థనతో సోలార్ కంచెల ఏర్పాటుకు జడ్పీ నిధుల నుంచి రూ.46 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు.అంగన్‌వాడీల్లో 50 గ్రాములుండాల్సిన గుడ్లు 30 గ్రాములు కూడా ఉండడం లేదని ఐసీడీఎస్ అధికారులను నిలదీశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.పాలసముద్రం జడ్పీటీసీ అన్బలగన్ మాట్లాడుతూ వనదుర్గాపురంలోని యూపీ పాఠశాలను తీసుకెళ్లి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్ఆర్ కండ్రిగ జడ్పీ పాఠశాలలో కలపడంతో 10మంది ఎస్టీ విద్యార్థులకు తీరని అన్యాయం జరిగిందన్నారు.గతంలో ఉన్న యూపీ స్కూల్‌ను కొనసాగించాలని డీఈవోను కోరారు. అలాగే మండలంలో అనేక మందికి తల్లికి వందనం డబ్బులు పడలేదని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు కావడం లేదని ఎర్రావారిపాళ్యం జడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు కూడా డబ్బులు పడడం లేదన్నారు.ఉపాధి బిల్లులను బయటి వ్యక్తులు అప్‌లోడ్ చేస్తున్నారని సదుం జడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి ఆరోపించారు.శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ అంగనవాడీ భవనాలు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కావడం లేదన్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా మధ్యాహ్నం 1.30గంటలకు ముగిసింది. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు విజయవాడలో జరిగిన సమావేశానికి హాజరుకావడంతో జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి రాలేకపోయారు. జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, జడ్పీ 5వ స్థాయి సంఘ చైర్పర్సన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణాల్లో పచ్చదనం తప్పనిసరి

వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిది ● కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్



అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్

చిత్తూరు కలెక్టరేట్, జూలై26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో ఇరువైపులా పచ్చదనం ఉండాలని కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్ అన్నారు. పలమనేరు రిజర్వు ఫారెస్టు, టేకుమంద ఎక్స్‌టెన్షన్‌లో నిర్మిస్తున్న నాలుగులేన్ల బెంగళూరు-చెన్నై గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రెండో విడత పనులపై రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శ్రీధర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతపురం, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు యశోదబాయి శెల్వం, డీఎఫ్‌వో భరణి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్ తదితరులతో సమీక్షించారు. ముఖ్యంగా వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్ లైఫ్ స్టాండింగ్ కమిటీ సూచనల మేరకు వన్యప్రాణుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చిత్తూరు అటవీ డివిజన్ పరిధిలోని 7.1 కిలోమీటర్ల రహదారిని, రాయల్ ఎలిఫెంట్ రిజర్వు ఫారెస్టు పరిధిలో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టవచ్చన్నారు. ఇందుకోసం వీలున్న ప్రాంతాల్లో అండర్‌పాస్‌లను నిర్మించాలని చెప్పారు. ప్రత్యేకించి ఏనుగుల కోసం కర్ణాటక ఆర్టీసీ శాఖ.. బందీపూర్, నాగర్‌హోల్ నేషనల్ పార్కులలో అమలుచేసిన యాంత్రిక రైల్వే అడ్డంకి రూపకల్పన విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వన్యప్రాణుల కదలిక అధ్యయనానికి ఎన్‌హెచ్ఏఐ నుంచి నిధులు సమకూర్చి జీపీఎస్ గ్రీన్ ఫీల్డ్ కారిడార్‌ను వినియోగించి ప్రాంతీయ సంస్థల పరిశీలకులు, వన్యప్రాణుల సంరక్షణ అధికారి, జిల్లా అటవీ అధికారి, ఫీల్డ్ సిబ్బందితో ఒక పరిశోధనా ప్రాజెక్టును అమలు చేయాలని సూచించారు. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో పది కిలోమీటర్లలోపు వన్యప్రాణుల సంరక్షణకు బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచనలిచ్చారు. రహదారి నిర్మాణాల్లో భాగంగా అటవీ విస్తీర్ణం తగ్గుతున్న నేపథ్యంలో అందుకు సమాన స్థలంలో పునఃఅటవీకరణను చేపట్టాలని స్పష్టం చేశారు. సమీప ప్రభావిత గ్రామాల ప్రజలకు పునరావాసాన్ని కల్పించాలన్నారు.

నేటి బంగారు కుటుంబాలే రేపటి మార్గదర్శకులు

పేదరిక నిర్మూలనకు కలసిరండి : కలెక్టర్ పిలుపు



అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నేటి బంగారు కుటుంబాలే రేపటి మార్గదర్శకులని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం పీ-4 కార్యక్రమానికి సంబంధించి గ్రామసభల నిర్వహణ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సచివాలయంలో 10 మంది మార్గదర్శకుల ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై రోజూ పీ-4పై వర్చువల్ కాన్ఫరెన్స్ జరుగుతుందన్నారు. మార్గదర్శకులను గుర్తించే ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. ఇందులో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు ఎంపీడీవోలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. జిల్లాలో పేదరిక నిర్మూలనకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మార్గదర్శకులను గుర్తించాక ఒక్కొక్కరు కనీసం 10 మందిని దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. సీపీవో, డీఈవో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దేశ రాజధానిని దక్షిణాదిలో ఏర్పాటు చేయాలి

● డీసీఎం డిమాండ్



కుప్పంలో డీసీఎం ర్యాలీ

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిని దక్షిణాదిలోనే ఏదో ఒక రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ద్రావిడ సిటీ మూవ్‌మెంట్ (డీసీఎం) డిమాండ్ చేసింది. కుప్పంలో శనివారం డీసీఎం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌నుంచి ఆర్టీసీ బస్టాండు దాకా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సెంట్రల్ పార్కులో సభ ఏర్పాటు చేశారు. ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన పలువురు వక్తలు ఈ సభలో మాట్లాడుతూ ఉత్తరాది రాజకీయ పార్టీలు దక్షిణాదిని అణగదొక్కుతున్నాయని ఆరోపించారు. హిందీ, సంస్కృత భాషలకు, ఆయా సంస్కృతులకు తాము వ్యతిరేకం కాదనీ,అయితే దక్షిణాది భాషలను, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఢిల్లీ దేశ రాజధానిగా ఉండడంవల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అక్కడికి వెళ్లలేక పోతున్నారన్నారు. సుప్రీంకోర్టు కూడా అక్కడే ఉండడంవల్ల కింది కోర్టుల్లో న్యాయం జరగలేదని భావించిన దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అంత దూరం వెళ్లి అప్పీలు చేయలేక మౌనంగా ఉండిపోవాల్సి వస్తున్నదన్నారు. దేశ రాజధానితోపాటు సుప్రీంకోర్టు బెంచిని కూడా దక్షిణాది రాష్ట్రాలలో ఏర్పాటు చేసి, న్యాయాన్ని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. దక్షిణాదివారిపై ఉత్తరాది వారి ఆధిపత్యాన్ని ఇక ఎంతమాత్రం అంగీకరించేప్రసక్తి లేదని, తమ హక్కులకోసం శాంతియుత ఉద్యమం చేస్తామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం ప్రతినిధులు అభిగౌడ, తోల్కాపియమ్ మాధురై, శివలింగం, దర్శన్, విజయ్, శెట్టి, పవన్, సరస్వతిలతోపాటు నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

ఒరూరు పేటలో నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ పనులను పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలంలోని ఒరూరుపేటలో ఆదివారం ఉదయం పది గంటలకు టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సీనియర్ టీడీపీ నాయకుడు, స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు గంధమనేని రాజేష్ తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నేతలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించిన రమేష్ చంద్రప్రసాద్ 1975లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1978లో నగరి నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. 1983లో టీడీపీలో చేరిన ఆయన 1987లో చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, ఎస్వీ షుగర్స్ చైర్మన్‌గా పని చేశారు. 1998లో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్‌గా పని చేశారు. రమేష్ చంద్రప్రసాద్ కోరిక మేరకు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు రాజేష్ వివరించారు. విగ్రహావిష్కరణ పనులను శనివారం పలువురు టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

మీ మామిడి వివరాలను సరిచూసుకోండి

తోతాపురి రైతులకు ఉద్యానశాఖ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళ్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుజ్జు పరిశ్రమలకు తోతాపురి మామిడి కాయలను తరలించిన రైతులు తమ వివరాలను సరిచూసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం తిమ్మోజుపల్లె సచివాయలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అందించడం జరిగిందని చెప్పారు. రైతు సేవా కేంద్రాల వద్ద తమ బ్యాంక్, ఆధార్‌తోపాటు ఎన్ని లోడ్లు కాయలను తరలించారో ఆ వివరాలను సరి చూసుకోవాలన్నారు. ర్యాంపుల వద్ద జరిగిన తోతాపురి అమ్మకాల వివరాలను వారంలోపు రైతు సేవా కేంద్రాలకు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు భారతి, సాగరిక పాల్గొన్నారు.

బోధనేతర పనుల భారం తగ్గించాలి : యూటీఎఫ్



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు సెంట్రల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుతో జిల్లా నాయకులు శనివారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి బోధనేతర పనులకే ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందన్నారు. యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణ తరగతులు తదితర కార్యక్రమాలతో బోధనకు ఉపాధ్యాయులను దూరం చేస్తున్నారని చెప్పారు. రోజూ ఏదో ఒక సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటూ టీచర్లపై ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బదిలీలు గడిచి నెల రోజులు కావస్తున్నా, ఇప్పటికీ వేలాది మంది రిలీవింగ్‌కు నోచుకోలేదన్నారు. చాలాచోట్ల సింగిల్ టీచర్ పాఠశాలలే పనిచేస్తున్నాయని, పేరుకు ఐదుగురు ఉన్నా.. పలుచోట్ల ఇద్దరే పనిచేస్తుండటంతో బోధన భారం ఎక్కువైందన్నారు. కేడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీల సమస్య పరిష్కారం కాకుండా పోవడంతో బదిలీ పొందిన టీచర్లకు జీతాలు రాలేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు రెడ్డెప్ప, రెహనా బేగం, ప్రసన్న కుమార్, బాషా, ప్రకాష్, ఏకాంబరం, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డీఈవోను విధుల నుంచి తొలగించాలి

ఫ్యాప్టో డిమాండ్

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో నిబంధనలు పాటించకపోగా, అసంబద్ధాలను ప్రశ్నించిన ఫ్యాప్టో తిరుపతి జిల్లా చైర్మన్ ఎస్.సురేష్‌ను అక్రమంగా సస్పెండ్ చేసిన చిత్తూరు జిల్లా డీఈవోను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) డిమాండ్ చేసింది.పురపాలక టీచర్ల పదోన్నతులను డీఈవో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారని, 2025లో రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు ఈ బదిలీల్లో పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాల్సి ఉండగా డీఈవో కావాలని ఇవ్వకుండా ఆపేశారని ఆరోపించింది. పైగా వీటిని ప్రశ్నించిన టీచర్‌ను సస్పెండ్ చేసి ఇబ్బందులకు గురిచేశారని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంటనే అక్రమ సస్పెన్షన్ ఎత్తివేసి, డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో అతిక్లిష్టమైన సర్జరీ

● గర్భిణి కడుపులో కణితి తొలగింపు

తిరుపతి(వైద్యం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): 46 ఏళ్ల మహిళ గర్భం నుంచి ముఖద్వారం వరకు వ్యాపించిన అతిపెద్ద కణితిని అతిక్లిష్టమైన సర్జరీ చేసి తొలగించి ఆమె ప్రాణాలు కాపాడామని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల శనివారం తెలిపారు. ఆమె ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన 46 ఏళ్ల మహిళ తీవ్ర కడుపునొప్పి సమస్యతో ఆస్పత్రికి రావడంతో ఆమెకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించా మన్నారు. కణితి ఉన్నట్లు గుర్తించారన్నారు. నిపుణులైన వైద్యుల సాయంతో సర్జరీ చేసి ఆ కణితిని తొలగించామని తెలిపారు. సాధారణంగా ఇటువంటి సర్జరీలకు ప్రవేటు ఆస్పత్రుల్లో రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందని అటువంటిది ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా, విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం మహిళ పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటోందని తెలియజేశారు.

ముక్కంటి క్షేత్రం భక్త జన సంద్రం



శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 511 మంది, రూ.200 శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా 2,304, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,447మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,800 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్రీడలతో యువతలో నూతనోత్తేజం


ప్రారంభ సమావేశంలో క్రీడాకారులతో పీఎస్ఎం, అప్పు ముఖేశ్ తదితరులు

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యువతలో క్రీడల ద్వారా నూతనోత్తేజం ఉద్భవిస్తుందని, దీంతో సమాజంలో వారి భాగస్వామ్యం పెరుగుతుందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం కొత్తపేటలో, కొత్తపేట టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌వీసీ వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎస్ఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.22 కోట్లతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తున్నారని, ఈ స్టేడియాన్ని అందరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తూ, యువతను క్రీడారంగంలో ప్రోత్సహిస్తున్న అప్పు ముఖేశ్‌ను పీఎస్ఎం అభినందించారు. స్థానిక ప్రజలు ఎల్లప్పుడూ టీడీపీని ఆదరిస్తున్నారని, కొత్తపేట అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కొత్తపేట టీడీపీ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, రాష్ట్ర కార్యదర్శి పి.గోపీనాథ్, నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యులు కన్నన్, మంజునాథ్, రాహుల్ కుమార్, మహేంద్ర గౌడ్, కృష్ణన్, నరసింహులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: టీడీపీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులందరికీ అందుతాయని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రజలకు హామీ ఇచ్చారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 15వ వార్డులో శనివారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, టీడీపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏడాది పాలన విజయాల గురించి వివరించారు. సంబంధిత కరపత్రాలు పంచిపెట్టారు. పీఎస్ఎం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గం, ప్రత్యేకించి కుప్పం పురపాలక సంఘంపై శ్రద్ధ పెట్టి అభివృద్ధి పనులకు వందల కోట్ల రూపాయలు మంజూరు చేశారని చెప్పారు. టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, తిరుమగల్, మునియప్ప, అన్సర్ బాష, మాగి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం


వి.కోట గ్రామసభలో మాట్లాడుతున్న రంగనాథ్

వి.కోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద, ధనికుల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకే సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. శనివారం వి.కోట గ్రామ సచివాలయం వద్ద పీ-4 కార్యక్రమానికి సంబంధించి అర్హుల ఎంపికకు గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరికంపై చేస్తున్న పోరులో బంగారు కుటుంబాలు సాధికారత సాధించేందుకు ప్రభుత్వంతో కలసి నడిచేందుకు ప్రతి ఒక్క పారిశ్రామిక వేత్త ముందుకు రావాలన్నారు. అర్హులైన బంగారు కుటుంబాల ఎంపికలో అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మీ, వైస్ సర్పంచ్ అక్కల్‌బాష, తహసీల్దార్ ఉదయసంతోష్, ఎంపీడీవో ఈశ్వరన్, ఈవో శ్రీనాథరెడ్డి, టీడీపీ నేతలు చౌడప్ప, సుబ్బన్న, శబరీష్, నారాయణస్వామి, ఇక్బాల్, రామచంద్రుడు, వేణు, కుమార్‌రాజా, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సదుం ఎంఈవోగా నటరాజన్



సదుం, జూలై 26(ఆంధ్రజ్యోతి): సదుం ఎంఈవో-1గా డాక్టర్ వి.జి.నటరాజన్ శనివారం ఎంఆర్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి చేస్తానన్నారు. ఎంఆర్సీ సిబ్బందితోపాటు ఎస్టీయూ నాయకులు మోహన్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికారు.

ద్విచక్ర వాహనం చోరీ

పుంగనూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం చోరీ అయిందని పూర్ణకుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు వివరాలు.... పెద్దపంజాణి మండలం కొల్తూరు గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు పూర్ణకుమార్ సొంత పనులపై పుంగనూరుకు ద్విచక్ర వాహనంలో వచ్చి పట్టణంలోని మయూరి క్యాంటీన్ వెనుకవైపున పెట్టాడు. పనులు పూర్తి చేసుకుని సాయంత్రం 4గంటలకు ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లేందుకు రాగా కనిపించలేదు. చుట్టు పక్కల పరిశీలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

షాపింగ్ మాల్‌ల ప్రైవేటీకరణపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, గవర్నర్ పేట్-1, పాత బస్టాండు స్థలాలను, షాపింగ్ మాల్‌లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట శనివారం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని సంస్థ తరఫునే టెండర్లు పిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కడప జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రహంతుల్లా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.గణేశ్, డిపో అధ్యక్షుడు మునస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ యంజీ.ప్రసాద్ కుమార్, కార్యదర్శి ఈ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ అధ్యక్షుడు కె.దిలీప్ కుమార్, నాయకులు వి.జయశంకర్, మోగిలీశ్వర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



రొంపిచెర్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని ఆర్ బెస్తపల్లె ప్రాథమిక పాఠశాలలో రొంపిచెర్లకు చెందిన వ్యాపారస్తుడు కిషోర్‌కుమార్ స్వర్గీయ గోగులపాటి సులోచన, జనార్ధనశెట్టి జ్ఞాపకార్థం బెస్తపల్లె పాఠశాల విద్యార్థులకు రూ.30 వేల విలువ గల డెస్క్‌లు, విద్యాసామగ్రి వితరణ చేశారు. హెచ్ఎం చాంద్‌బాషా, దాతలు హిమబిందు కిషోర్‌కుమార్, సీఆర్పీలు అనసూయ, కిషోర్, హరి, రవి పాల్గొన్నారు.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ


సెల్వ పాండియన్, చంద్రమ్మ

శాంతిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల విద్యాశాఖ అధికారులుగా సెల్వ పాండియన్ ఎంఈవో-1గా, చంద్రమ్మ ఎంఈవో-2గా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీఆర్పీలు, టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ నాగరాజు, ఇతర నేతలు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మధుసూదన్, మునెప్ప, రాము, రమేష్, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆరుగురు కోడి పందెం రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ ఆవులపల్లె సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడులు చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3600లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటిపై దాడి చేశారని మహిళ ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): తన ఇంటిపై దాడి చేశారంటూ ఓ మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలు... పట్టణంలోని ఎంబీటీ రోడ్డు తాజ్‌నగర్‌లో నివాసముంటున్న మహబూబ్‌బాషా భార్య ముత్తాజ్ బేగం అదే ప్రాంతానికి చెందిన ఫాతిమా వద్ద మూడు నెలల క్రితం ఇంటిని రూ.9లక్షలకు కొనుగోలు చేసి అడ్వాన్సుగా రూ.2లక్షలు ఇచ్చి, అదే ఇంటిలో కాపురం ఉంటున్నారు. శనివారం ఫాతిమా కొంతమందితో కలిసి వచ్చి ఇంటిపై దాడి చేసి, వస్తువులు బయట పడేసి తనపై దాడి చేసి గాయపరిచినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముత్తాజ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్వారీ రాయి పడి కార్మికుడికి గాయాలు

పుంగనూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): క్వారీలో పని చేస్తున్న కార్మికుడిపై శనివారం సాయంత్రం బండరాయి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బీహార్‌కు చెందిన దీపక్(22) పుంగనూరు మండలం సుగాలిమిట్ట సమీపంలోని వినాయక గ్రానైట్‌లో కార్మికుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం పనులు చేస్తుండగా బండరాయి చేతిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు గుర్తించి గాయపడిన దీపక్‌ను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

వృద్ధులకు ఇళ్ల వద్దే రేషన్ సరుకులు

సదుం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగివారిపల్లెలో రేషన్ డీలర్ ప్రకాశ్ శనివారం ఒక్కరోజే వృద్ధులందరికీ ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందజేశారు.

సోమలలో సుపరిపాలన

సోమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నేతలు ఉమాపతి నాయుడు, పి.శివశంకర ఆధ్వర్యంలో నిర్వహించారు.

సైనికులకు ఘన సన్మానం


సైనికులను సన్మానిస్తున్న బసవరాజ ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకులు

పుంగనూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో జవానుల సేవలు మరువలేనివని బసవరాజ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు పేర్కొన్నారు. కార్గిల్ విజయ దినోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బసవరాజ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఆవరణలో సోమల మండలం ఆవులపల్లెకు చెందిన విశ్రాంత కెప్టెన్ మహేశ్వర్, పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి గ్రామానికి చెందిన సైనికులు రమేశ్, కుమార్‌లను ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన వీర జవాన్లకు శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సోమల పురవీధుల్లో విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో గౌతమ్, అధ్యాపకులు వెంకటరమణ నాయక్, వెంకటసుబ్బయ్య, శివయ్య, రవీంద్రారెడ్డి, పుష్పకుమార్, రామకృష్ణ, లక్ష్మీ, నాగరత్న, సుధా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పేదల బతుకుల్లో వెలుగులు

రామకుప్పం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీలకతీతంగా పేదల బతుకుల్లో వెలుగులు నింపాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధి బందార్లపల్లె గ్రామ సచివాలయంలో పీ-4పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా పటిష్ఠంగా ఉన్న వారు బంగారు కుటుంబాల ఎదుగుదలకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, నేతలు శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ఆనందరెడ్డి, లింగాపురం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పీ-4 దత్తత బాధ్యతపై అవగాహన

సోమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పీ-4 విధానంపై తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో నారాయణ శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల వారిని దత్తత తీసుకునేందుకు డీలర్లకు పలుసూచనలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, ఆర్ఐ సుబుక్తుల్లా, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లాలి

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లాలని టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం మున్సిపాలిటీలోని 12వ క్లస్టర్ పరిధిలో జరుగుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై శనివారం క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో ఆయన సమీక్ష నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, కో క్లస్టర్, కో యూనిట్, కో బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనతో అన్ని వర్గాలకు లబ్ధి

వి.కోట, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని తెలుగు యువత జిలా కార్యదర్శి శబరీష్ అన్నారు. శనివారం సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వి.కోట, బోడిగుట్టపల్లె, కుంబార్లపల్లె, పెద్దబరిణేపల్లె, నెర్నపల్లె, తోటకనుమ పంచాయతీలో పార్టీ ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంచిపెడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. టీడీపీ నేతలు రామ్మూర్తి, బాలసుందరం, నాగరాజు, వెంకట్రమణ, అయాజ్, కృష్ణరాయప్ప, మురుగేష్, సురేంద్ర, రవీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

● అనాథలైన బిడ్డలు


రమాదేవి (ఫైల్ ఫొటో)

శాంతిపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు... శాంతిపురం మండలం శివరామపురం పంచాయతీ గట్టూరు గ్రామానికి చెందిన రమాదేవి(38) రాళ్ళబూదుగూరు పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 16వ తేదీన శాంతిపురం వెళ్లి విధులు ముగించుకొని ఎస్‌బీఐ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమాదేవి తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రమాదేవి భర్త కూడా గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందాడు. వీరికి మోక్షిత(9), యశ్విత(3) అనే కుమార్తెలు ఉండగా, తల్లిదండ్రులు ఇద్దరు లేకపోవడంతో వారు అనాథలయ్యారని బంధువులు, గ్రామస్తులు విలపించారు. అభం శుభం తెలియని ఆ చిన్నారులు తల్లి మృతదేహం వద్ద అమ్మా లే అమ్మా అంటూ ఏడుస్తుంటే గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. బంధువుల ఫిర్యాదు మేరకు రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవిందమాల దీక్ష చేపట్టిన భక్తులు

బైరెడ్డిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ప్రారంభం కావడంతో స్థానిక ఆంజనేయస్వామి ఆలయంవద్ద శనివారం అర్చకులు మురళీధరాచార్యులు పలువురు భక్తులకు గోవిందమాల వేశారు. 30 రోజులపాటు భక్తులు వెంకటేశ్వరస్వామిని కొలుస్తూ పూజలు ఆచరించి, తిరుమలకు వెళ్లి స్వామిని దర్శించుకుని దీక్ష విరమిస్తారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

బైరెడ్డిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈ యేడాది జరిగిన పదోతరగతి పరీక్షల్లో హిందీ సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని కమ్మనపల్లె ఆదర్శపాఠశాల విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. వందమార్కులు సాధించిన భానుప్రియ, మధుశ్రీ, కౌశిక్‌లకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున, 90 మార్కులకు పైగా సాధించిన హేమావతి, సంజన, జస్వంత్, మతిన్, తాహీద్, గిరివర్ధన్, ప్రియదర్శన్‌లకు రూ.500 చొప్పున నగదు బహుమతులను హిందీ ఉపాధ్యాయుడు మురళీకుమార్ పంపిణీచేసి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి 'పీజీఆర్ఎస్' రద్దు

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడా పీడీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గ ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు.

వైభవంగా శ్రావణ శనివార పూజలు

రామకుప్పం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణ శనివార పూజలు వైభవంగా జరిగాయి. సుబ్రహ్మణ్యస్వామి, శనీశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతోకిటకిటలాడాయి.



● చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో ఉదయాన్నే ఆలయ అర్చకులు కొండపై వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి, కొండ కింద బండపై కొలువైన ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఉపవాసదీక్షతో స్వామివార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక బజారు వీధిలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● పుంగనూరు: స్థానిక కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి, పుంగమ్మ చెరువు మొరవ, దండుపాళ్యం రోడ్డులో వెలిసిన శనేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ కుటుంబసభ్యులు అన్నదానం చేశారు. నాలుగు శనివారాలు భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు సీవీరెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం నలగుండ్రాయస్వామి ఆలయం, మురారిపల్లె ఓబులేశ్వరస్వామి ఆలయం, పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయం, బైరెడ్డిపల్లె శేషాద్రిస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

● సోమల: సోమల వెంకటేశ్వరస్వామి పాదాల ఆలయం, ఆవులపల్లె పరుష వెంకటేశ్వరస్వామి ఆలయం, కమ్మపల్లె లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, సూరయ్యగారిపల్లె, చింతవారిపల్లె తదితర ఆలయాల్లో భక్తులు అభిషేకపూజల్లో పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు దుకాణాల్లో ఉంచరాదు

రొంపిచెర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లెల గ్రామంలోని పలు దుకాణాలను ఎస్ఐ సుబ్బారెడ్డి సిబ్బందితో శనివారం వెళ్లి తనిఖీలు చేశారు. హాన్స్, గుట్కా వంటి నిషేధిత వస్తువుల విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

30మందికి జరిమానా

బైరెడ్డిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో పాఠశాలల పరిసరాల్లో వందమీటర్ల పరిధిలో దుకాణాల్లో సిగరెట్లు, మత్తుపదార్థాలు విక్రయిస్తున్న వారిపై కేసు నమోదుచేసి జరిమానా విధించినట్లు బైరెడ్డిపల్లె ఎస్ఐ పరశురాముడు తెలిపారు. పోలీసు సిబ్బంది శనివారం దుకాణాలను తనిఖీచేసి, 30 దుకాణాలకు సంబంధించి రూ.6000 జరిమానా విధించినట్లు చెప్పారు.

కమనీయం... సుభద్ర కల్యాణం

సోమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కందూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞం సందర్భంగా శనివారం సుభద్ర కల్యాణం కమనీయంగా నిర్వహించారు. పంచ పాండవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్త పి.శ్రీనివాసులు అభిషేక పూజలు జరిపారు. భాగవతారిణి గీతాశ్రీ రాజసూయ యాగం ఘట్టాన్ని ఆలపించారు. ఉభయదారుడు జి.వెంకటేశు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పరిశుభ్రతపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి

బైరెడ్డిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పరిశుభ్రతపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయచందర్ సూచించారు. మండలంలోని కమ్మనపల్లె ఆదర్శపాఠశాల, కస్తూర్బా పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, సీహెచ్‌వో జ్యోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

పుంగనూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులకు 41 రోజుల పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం పట్టణంలోని కోనేటి వద్ద గల అయ్యప్ప ఆలయ ఆవరణలో అయ్యప్ప చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి మాల ధరించిన భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి యేటా అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

రామకుప్పం, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలందరికీ అండగా నిలుస్తోందని తెలుగుయువత రామకుప్పం మండల అధ్యక్షుడు విశ్వనాథ్ తెలిపారు. శనివారం పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేతలు పార్థసారథి, గజేంద్ర, బాబు, ఉమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పుంగనూరు - మదనపల్లె మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి రెండు చోట్ల కాలు విరిగిన సంఘటన శనివారం పుంగనూరులో జరిగింది. వివరాలు... మండలంలోని మోదుగులపల్లె పంచాయతీ కంటేపల్లెకు చెందిన కదిరప్ప కుమారుడు అంజప్ప(55) ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వస్తుండగా పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో, అంజప్ప కాలు రెండుచోట్ల విరిగింది. స్థానికులు చికిత్స నిమిత్తం పుంగనూరు ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని గాయపడిన అంజప్పను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

సోమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయల లోడ్‌తో ట్రాక్టర్‌ను అతి వేగంగా నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. ఈనెల 22వ తేదీ మంగళవారం పుంగనూరు - తిరుపతి రోడ్డు కరకమంద వద్ద చౌడేపల్లె మండలం యల్లకుంటకు చెందిన గంగిరెడ్డి మామిడి కాయల లోడ్‌తో ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డుపై వెళుతున్న షేక్ గౌస్ బాషాను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గౌస్ బాషా తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. షేక్ షౌకత్ బాషా ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్గిల్ అమర వీరులకు నివాళి



సుబేదార్ హరికృష్ణారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు సెంట్రల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ శనివారం చిత్తూరులోని కార్గిల్ స్థూపం వద్ద నివాళి అర్పించి, పలువురు మాజీ సైనికులను సన్మానించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న చిత్తూరు వాసి సుబేదార్ హరికృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, రవికుమార్, సత్యభామ, సి.బాబు, రెహమాన్, సురేష్, లితిలష్, షణ్ముగం, సత్య, పూర్ణచంద్ర, రామభద్ర, తదితరులు పాల్గొన్నారు. కాగా, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్, కార్యదర్శి రఘు, డివిజన్ అధ్యక్షుడు పళని ఆధ్వర్యంలోనూ మాజీ సైనికులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ రాఘవులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్లో మోటరు సైకిల్ రైడింగ్ పోటీలు





పోటీదారులకు సూచనలిస్తున్న ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ - పోటీల్లో పాల్గొన్న పోలీసుశాఖ సిబ్బంది

చిత్తూరు అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్లో మోటరు సైకిల్ రైడింగ్ పోటీలను శనివారం స్థానిక సాయుధ దళం కార్యాలయంలోని పరేడ్ మైదానంలో పోలీసుశాఖ సిబ్బందికి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను డీఎస్పీ సాయినాథ్ శనివారం ప్రారంభించారు. 40మంది పాల్గొని రెండో రౌండ్‌కు ఎంపికయ్యారు. ఇదివరకు రిజిస్టర్ చేసుకున్న జిల్లా ప్రజలకు ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. అర్హత సాధించిన వారికి పోలీసు సిబ్బందితో కలిపి రెండో రౌండ్‌ను నిర్వహించి.. విజేతలకు ఎస్పీ మణికంఠ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

పోటీ జరిగేదిలా..

వంద మీటర్ల దూరాన్ని కాలు కింద పెట్టకుండా స్లో మోటర్ సైకిల్ రైడింగ్ చేస్తారో వారిని విజేతగా ప్రకటిస్తారు. ప్రతి బ్యాచ్‌లో కొంత మందిని అనుమతించి పోటీలు నిర్వహిస్తారు. మొదటి రౌండ్‌లోని అన్ని బ్యాచ్‌లలో విన్నర్లను రెండో రౌండ్‌కు పంపుతారు. వచ్చిన పోటీదారులను అనుసరించి రౌండ్ల సంఖ్యను నిర్ధారిస్తారు. చివరి రౌండ్‌లో ఒకటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను ఇస్తారు. విజయం విద్యా సంస్థల సౌజన్యంతో మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలను, ట్రోఫీలను ఇవ్వనున్నారు.

ఢిల్లీలో స్వాతంత్ర్య దిన వేడుకలకు రండి

కొత్తపల్లె సర్పంచ్‌కు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సర్పంచ్‌కు అరుదైన ఆహ్వానం అందింది. వచ్చే నెల ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనడానికి కుప్పం మండలం కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కె.రాజశేఖర్‌కు ఆహ్వానం అందింది. రాష్ట్రవ్యాప్తంగా పది మంది సర్పంచ్‌లకు అవకాశం కల్పించగా, ఇందులో జిల్లా నుంచి రాజశేఖర్ ఉన్నారు. జీవిత భాగస్వామితో కలిసి రావాలని ఆహ్వానంలో పేర్కొన్నారు. వీరికి ఢిల్లీకి రానుపోను రవాణా ఖర్చులతోపాటు అక్కడ వసతి సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పిస్తుంది. సర్పంచ్ వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ.. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పంపారు. రాజశేఖర్ సర్పంచ్‌గా కొత్తపల్లె పంచాయతీలోని అన్ని ఇళ్లకు తాగునీటి కొళాయి వసతి కల్పించారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా బలహీన కుటుంబాలకు రుణ సదుపాయం, తదితర సౌకర్యాలను కల్పించిన కారణంగా ఈ వేడుకలకు ఎంపికయ్యారు.

'ఆశా కార్యకర్తల' ఇంటర్వ్యూలకు 142 మంది హాజరు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల ఉద్యోగాలకు శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 142 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 69 పోస్టులకు 174మంది దరఖాస్తు చేసుకున్నారని డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో రెండ్రోజుల్లో ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామన్నారు. నోడల్ అధికారి హనుమంతరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూవిభజనకు డిసెంబరు వరకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూయజమానులు తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకునేందుకు డిసెంబరు 31వ తేదీవరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు జేసీ విద్యాధరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూవిభజన కోసం సాధారణంగా వసూలుచేసే రూ. 500 రుసుంను ప్రభుత్వం మాఫీ చేసిందని, రూ.50 నామమాత్రపు దరఖాస్తు రుసుం చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఇందుకోసం సచివాలయాల్లో నిర్దేశిత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాయింట్ పట్టాదారులు తమ భూములను విడిగా నమోదుచేసుకుని తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందవచ్చన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



ఆలయంలో చంద్రప్రకాష్ గోయల్, శ్రీనివాస్, శ్రీధర్, సెల్వం

ఐరాల(కాణిపాకం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అటవీశాఖ కన్జర్వేటర్లు శ్రీధర్, సెల్వంలు శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు. డీఎఫ్‌వో భరణి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, కాణిపాకం ఇన్‌చార్జి ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నాటుబాంబు పేలి ఆవు మృతి

● మామిడితోటలో 19 నాటు బాంబుల స్వాధీనం



తీవ్రంగా గాయపడిన ఆవు

కల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం 102 ఈ రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ చిగురమాకులపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో శనివారం సాయంత్రం నాటు బాంబు పేలడంతో ఆవు మృతి చెందింది. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు... చిగురమాకులపల్లికి చెందిన పాడి రైతు మల్లికార్జున ఆవును మేపుకునేందుకు గ్రామానికి సమీపంలోని ఓ మామిడితోట వద్దకు తోలుకెళ్లాడు. మామిడితోటలో అడవి పందుల కోసం అమర్చిన నాటుబాంబును ఆవు కొరకడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. దీంతో రైతు మల్లికార్జున పరిశీలించగా ఆవుకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అడవి పందుల కోసం నాటుబాంబు అమర్చిన వ్యక్తి గురించి పోలీసులు ఆరా తీశారు. ఇదే గ్రామానికి చెందిన కృష్ణమాచారి (65)గా గుర్తించి అతడి వద్ద ఉన్న 19 నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా శనివారం రాత్రి సమయంలో ఆవు మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. కృష్ణమాచారి, ఆయన కుమారుడు మునిసుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐటీసీతో కుప్పం మున్సిపాలిటీ ఒప్పందం



ఎస్జీఎస్ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం శనివారం ఐటీసీ తరఫున అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ (ఎస్జీఎస్) స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులలో ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్తను వేరుచేసే ప్రక్రియను ఎస్జీఎస్ చేపడుతుంది. చెత్త నిర్వహణకు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగిస్తుంది. తడి పొడి చెత్తలను వేర్వేరు చేసేలా వారిని ప్రోత్సహించి ఆరోగ్యకరమైన శుభ్రమైన స్వచ్ఛ కుప్పం లక్ష్య సాధనకు సహకరిస్తుంది. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఎస్జీఎస్ ఈడీ బాలకృష్ణమూర్తిలు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఆంజనేయులు, ఎస్జీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రాకుంటే

సమస్యలెవరికి చెప్పుకోవాలి?

గైర్హాజరైన జిల్లా అధికారులకు నోటీసులు ఇవ్వండి

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్మన్, సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశాలకు జిల్లాస్థాయి అధికారులు రావడంలేదని, హెచ్చరించినా కొందరి తీరు మారడం లేదని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులతో పాటు పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో పాటు సభ్యులు తాము పనిలేక సమావేశాలకు వస్తున్నామా అంటూ ధ్వజమెత్తారు.అధికారులు రాకపోతే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన అధికారులైతే ముందు నుంచి కూడా సమావేశాలకు హాజరు కావడం లేదని, ఆయా జిల్లాలకు చెందిన సభ్యులు జడ్పీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు.గత మూడు సమావేశాలకు హాజరు కాని తిరుపతి ఐసీడీఎస్ అధికారికి నోటీసులు ఇవ్వాలని జడ్పీ చైర్మన్ ఆదేశించారు. అలాగే సమావేశానికి రాని జిల్లా స్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం మొదలైందని.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ వర్కులు పూర్తి చేయాలని డీపీవోను ఆదేశించారు.గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ నిర్వాహకులకు నిధులున్నా వేతనాలను ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. వీధి లైట్లు నిరంతరాయంగా వెలుగుతున్న కారణంగా పంచాయతీలపై విద్యుత్ భారం పడుతోందని వెంటనే వాటికి స్విచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఏనుగుల దాడుల నివారణకు కలెక్టర్ అభ్యర్థనతో సోలార్ కంచెల ఏర్పాటుకు జడ్పీ నిధుల నుంచి రూ.46 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు.అంగన్‌వాడీల్లో 50 గ్రాములుండాల్సిన గుడ్లు 30 గ్రాములు కూడా ఉండడం లేదని ఐసీడీఎస్ అధికారులను నిలదీశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.పాలసముద్రం జడ్పీటీసీ అన్బలగన్ మాట్లాడుతూ వనదుర్గాపురంలోని యూపీ పాఠశాలను తీసుకెళ్లి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎస్ఆర్ కండ్రిగ జడ్పీ పాఠశాలలో కలపడంతో 10మంది ఎస్టీ విద్యార్థులకు తీరని అన్యాయం జరిగిందన్నారు.గతంలో ఉన్న యూపీ స్కూల్‌ను కొనసాగించాలని డీఈవోను కోరారు. అలాగే మండలంలో అనేక మందికి తల్లికి వందనం డబ్బులు పడలేదని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు కావడం లేదని ఎర్రావారిపాళ్యం జడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు కూడా డబ్బులు పడడం లేదన్నారు.ఉపాధి బిల్లులను బయటి వ్యక్తులు అప్‌లోడ్ చేస్తున్నారని సదుం జడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి ఆరోపించారు.శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ అంగనవాడీ భవనాలు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కావడం లేదన్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా మధ్యాహ్నం 1.30గంటలకు ముగిసింది. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు విజయవాడలో జరిగిన సమావేశానికి హాజరుకావడంతో జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి రాలేకపోయారు. జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, జడ్పీ 5వ స్థాయి సంఘ చైర్పర్సన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణాల్లో పచ్చదనం తప్పనిసరి

వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిది ● కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్



అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్

చిత్తూరు కలెక్టరేట్, జూలై26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో ఇరువైపులా పచ్చదనం ఉండాలని కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్ అన్నారు. పలమనేరు రిజర్వు ఫారెస్టు, టేకుమంద ఎక్స్‌టెన్షన్‌లో నిర్మిస్తున్న నాలుగులేన్ల బెంగళూరు-చెన్నై గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రెండో విడత పనులపై రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శ్రీధర్‌తో కలిసి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతపురం, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు యశోదబాయి శెల్వం, డీఎఫ్‌వో భరణి, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్ తదితరులతో సమీక్షించారు. ముఖ్యంగా వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్ లైఫ్ స్టాండింగ్ కమిటీ సూచనల మేరకు వన్యప్రాణుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులేకుండా చిత్తూరు అటవీ డివిజన్ పరిధిలోని 7.1 కిలోమీటర్ల రహదారిని, రాయల్ ఎలిఫెంట్ రిజర్వు ఫారెస్టు పరిధిలో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టవచ్చన్నారు. ఇందుకోసం వీలున్న ప్రాంతాల్లో అండర్‌పాస్‌లను నిర్మించాలని చెప్పారు. ప్రత్యేకించి ఏనుగుల కోసం కర్ణాటక ఆర్టీసీ శాఖ.. బందీపూర్, నాగర్‌హోల్ నేషనల్ పార్కులలో అమలుచేసిన యాంత్రిక రైల్వే అడ్డంకి రూపకల్పన విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వన్యప్రాణుల కదలిక అధ్యయనానికి ఎన్‌హెచ్‌ఏఐ నుంచి నిధులు సమకూర్చి జీపీఎస్ గ్రీన్ ఫీల్డ్ కారిడార్‌ను వినియోగించి ప్రాంతీయ సంస్థల పరిశీలకులు, వన్యప్రాణుల సంరక్షణ అధికారి, జిల్లా అటవీ అధికారి, ఫీల్డ్ సిబ్బందితో ఒక పరిశోధనా ప్రాజెక్టును అమలు చేయాలని సూచించారు. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో పది కిలోమీటర్లలోపు వన్యప్రాణుల సంరక్షణకు బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచనలిచ్చారు. రహదారి నిర్మాణాల్లో భాగంగా అటవీ విస్తీర్ణం తగ్గుతున్న నేపథ్యంలో అందుకు సమాన స్థలంలో పునఃఅటవీకరణను చేపట్టాలని స్పష్టం చేశారు. సమీప ప్రభావిత గ్రామాల ప్రజలకు పునరావాసాన్ని కల్పించాలన్నారు.

నేటి బంగారు కుటుంబాలే రేపటి మార్గదర్శకులు

పేదరిక నిర్మూలనకు కలసిరండి : కలెక్టర్ పిలుపు



అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నేటి బంగారు కుటుంబాలే రేపటి మార్గదర్శకులని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం పీ-4 కార్యక్రమానికి సంబంధించి గ్రామసభల నిర్వహణ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సచివాలయంలో 10 మంది మార్గదర్శకుల ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై రోజూ పీ-4పై వర్చువల్ కాన్ఫరెన్స్ జరుగుతుందన్నారు. మార్గదర్శకులను గుర్తించే ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. ఇందులో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు ఎంపీడీవోలు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. జిల్లాలో పేదరిక నిర్మూలనకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మార్గదర్శకులను గుర్తించాక ఒక్కొక్కరు కనీసం 10 మందిని దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. సీపీవో, డీఈవో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దేశ రాజధానిని దక్షిణాదిలో ఏర్పాటు చేయాలి

● డీసీఎం డిమాండ్



కుప్పంలో డీసీఎం ర్యాలీ

కుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిని దక్షిణాదిలోనే ఏదో ఒక రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ద్రావిడ సిటీ మూవ్‌మెంట్ (డీసీఎం) డిమాండ్ చేసింది. కుప్పంలో శనివారం డీసీఎం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌నుంచి ఆర్టీసీ బస్టాండు దాకా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సెంట్రల్ పార్కులో సభ ఏర్పాటు చేశారు. ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన పలువురు వక్తలు ఈ సభలో మాట్లాడుతూ ఉత్తరాది రాజకీయ పార్టీలు దక్షిణాదిని అణగదొక్కుతున్నాయని ఆరోపించారు. హిందీ, సంస్కృత భాషలకు, ఆయా సంస్కృతులకు తాము వ్యతిరేకం కాదనీ,అయితే దక్షిణాది భాషలను, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఢిల్లీ దేశ రాజధానిగా ఉండడంవల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అక్కడికి వెళ్లలేక పోతున్నారన్నారు. సుప్రీంకోర్టు కూడా అక్కడే ఉండడంవల్ల కింది కోర్టుల్లో న్యాయం జరగలేదని భావించిన దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అంత దూరం వెళ్లి అప్పీలు చేయలేక మౌనంగా ఉండిపోవాల్సి వస్తున్నదన్నారు. దేశ రాజధాని తోపాటు సుప్రీంకోర్టు బెంచిని కూడా దక్షిణాది రాష్ట్రాలలో ఏర్పాటు చేసి, న్యాయాన్ని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. దక్షిణాదివారిపై ఉత్తరాది వారి ఆధిపత్యాన్ని ఇక ఎంతమాత్రం అంగీకరించేప్రసక్తి లేదని, తమ హక్కులకోసం శాంతియుత ఉద్యమం చేస్తామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం ప్రతినిధులు అభిగౌడ, తోల్క్‌పియమ్ మాధురై, శివలింగం, దర్శన్, విజయ్, శెట్టి, పవన్, సరస్వతిలతోపాటు నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



ముక్కంటి క్షేత్రం భక్త జన సంద్రం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 511 మంది, రూ.200 శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా 2,304, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,447మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,800 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఒరూరు పేటలో నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ





ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ పనులను పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలంలోని ఒరూరుపేటలో ఆదివారం ఉదయం పది గంటలకు టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సీనియర్ టీడీపీ నాయకుడు, స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు గంధమనేని రాజేష్ తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నేతలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించిన రమేష్ చంద్రప్రసాద్ 1975లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1978లో నగరి నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. 1983లో టీడీపీలో చేరిన ఆయన 1987లో చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, ఎస్వీ షుగర్స్ చైర్మన్‌గా పని చేశారు. 1998లో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్‌గా పని చేశారు. రమేష్ చంద్రప్రసాద్ కోరిక మేరకు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు రాజేష్ వివరించారు. విగ్రహావిష్కరణ పనులను శనివారం పలువురు టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

మీ మామిడి వివరాలను సరిచూసుకోండి

తోతాపురి రైతులకు ఉద్యానశాఖ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళ్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుజ్జు పరిశ్రమలకు తోతాపురి మామిడి కాయలను తరలించిన రైతులు తమ వివరాలను సరిచూసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం తిమ్మోజుపల్లె సచివాయలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అందించడం జరిగిందని చెప్పారు. రైతు సేవా కేంద్రాల వద్ద తమ బ్యాంక్, ఆధార్‌తోపాటు ఎన్ని లోడ్లు కాయలను తరలించారో ఆ వివరాలను సరి చూసుకోవాలన్నారు. ర్యాంపుల వద్ద జరిగిన తోతాపురి అమ్మకాల వివరాలను వారంలోపు రైతు సేవా కేంద్రాలకు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు భారతి, సాగరిక పాల్గొన్నారు.

బోధనేతర పనుల భారం తగ్గించాలి : యూటీఎఫ్



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు సెంట్రల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుతో జిల్లా నాయకులు శనివారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి బోధనేతర పనులకే ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందన్నారు. యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణ తరగతులు తదితర కార్యక్రమాలతో బోధనకు ఉపాధ్యాయులను దూరం చేస్తున్నారని చెప్పారు. రోజూ ఏదో ఒక సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటూ టీచర్లపై ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బదిలీలు గడిచి నెల రోజులు కావస్తున్నా, ఇప్పటికీ వేలాది మంది రిలీవింగ్‌కు నోచుకోలేదన్నారు. చాలాచోట్ల సింగిల్ టీచర్ పాఠశాలలే పనిచేస్తున్నాయని, పేరుకు ఐదుగురు ఉన్నా.. పలుచోట్ల ఇద్దరే పనిచేస్తుండటంతో బోధన భారం ఎక్కువైందన్నారు. కేడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీల సమస్య పరిష్కారం కాకుండా పోవడంతో బదిలీ పొందిన టీచర్లకు జీతాలు రాలేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు రెడ్డెప్ప, రెహనా బేగం, ప్రసన్న కుమార్, బాషా, ప్రకాష్, ఏకాంబరం, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డీఈవోను విధుల నుంచి తొలగించాలి

ఫ్యాప్టో డిమాండ్

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో నిబంధనలు పాటించకపోగా, అసంబద్ధాలను ప్రశ్నించిన ఫ్యాప్టో తిరుపతి జిల్లా చైర్మన్ ఎస్.సురేష్‌ను అక్రమంగా సస్పెండ్ చేసిన చిత్తూరు జిల్లా డీఈవోను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) డిమాండ్ చేసింది.పురపాలక టీచర్ల పదోన్నతులను డీఈవో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారని, 2025లో రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు ఈ బదిలీల్లో పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాల్సి ఉండగా డీఈవో కావాలని ఇవ్వకుండా ఆపేశారని ఆరోపించింది. పైగా వీటిని ప్రశ్నించిన టీచర్‌ను సస్పెండ్ చేసి ఇబ్బందులకు గురిచేశారని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంటనే అక్రమ సస్పెన్షన్ ఎత్తివేసి, డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో అతిక్లిష్టమైన సర్జరీ

● గర్భిణి కడుపులో కణితి తొలగింపు

తిరుపతి(వైద్యం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): 46 ఏళ్ల మహిళ గర్భం నుంచి ముఖద్వారం వరకు వ్యాపించిన అతిపెద్ద కణితిని అతిక్లిష్టమైన సర్జరీ చేసి తొలగించి ఆమె ప్రాణాలు కాపాడామని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల శనివారం తెలిపారు. ఆమె ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన 46 ఏళ్ల మహిళ తీవ్ర కడుపునొప్పి సమస్యతో ఆస్పత్రికి రావడంతో ఆమెకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించా మన్నారు. కణితి ఉన్నట్లు గుర్తించారన్నారు. నిపుణులైన వైద్యుల సాయంతో సర్జరీ చేసి ఆ కణితిని తొలగించామని తెలిపారు. సాధారణంగా ఇటువంటి సర్జరీలకు ప్రవేటు ఆస్పత్రుల్లో రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందని అటువంటిది ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా, విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం మహిళ పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటోందని తెలియజేశారు.

ఎమ్మెల్యే థామస్‌పై బురద చల్లే రాజకీయం చేస్తే ఊరుకోం: టీడీపీ

వెదురుకుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే థామస్‌పై బురద చల్లే రాజకీయం చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన పీఏ ఎస్.అనిల్ హెచ్చరించారు. ఎమ్మెల్యే వద్ద పీఏ చంద్రశేఖర్ ఉండటం వల్ల కొంతమంది ఆటలు సాగక లేనిపోని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీకి నష్టం కలిగించే ఉద్దేశం లేకపోతే కలెక్టర్ దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఏముచ్చిందన్నారు.

అవినీతి అనకొండ 'గుండయ్య'

శ్రీరంగరాజపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య ఓ అవినీతి అనకొండ అని ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్ దుయ్యబట్టారు. శనివారం ఎస్ఆర్‌పురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే థామస్ వెంట ఉంటూ అవినీతి, అక్రమాలకు పాల్పడి పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే పసిగట్టి దూరంగా పెట్టడంతో జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలకు దిగారని వెల్లడించారు. టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడుదశరాజు, నేతలు నాగరాజు, చిన్నబ్బ, రాజు, లోకేశ్, గల్లా రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



వన వేణుగోపాలుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాల స్వామికి శనివారం క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.



దేశ రక్షణ.. మనందరి బాధ్యత

గుడిపాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ.. మనందరి బాధ్యత అని ఆర్ఎస్ఎస్ ప్రచారక్ ప్రకాష్ అన్నారు. శనివారం సీఎస్ఆర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎక్కువ మంది సైన్యంలో చేరాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కళాశాల ప్రముఖ్ నరేంద్ర, కళాశాల కరస్పాండెంట్ లోకేష్, ప్రిన్సిపాల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అర్జున్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి అరాచకం

రోడ్డు పక్కన పడేస్తున్న క్వారీ వేస్ట్ రాళ్లు

ఇదేమని ప్రశ్నిస్తే దూషిస్తున్నాడని టీఎన్ఎస్ఎఫ్ నేత ఆరోపణ


రోడ్డు పక్కన పడేసిన క్వారీ వేస్ట్ రాళ్లు

శ్రీరంగరాజపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం కటికపల్లె పంచాయతీ పిల్లిగుండ్లపల్లెలోని వైసీపీ నాయకుడు పి.సుబ్రహ్మణ్యం నాయుడు అలియాస్ మొద్దు నాయుడు అరాచకం శ్రుతి మించుతోందని జీడీ నెల్లూరు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.జగదీష్ తెలిపారు. క్వారీ వేస్ట్ రాళ్లను తీసుకొచ్చి మూడు నెలలుగా రోడ్డు పక్కన పడేస్తున్నాడని చెప్పారు. ఇదేంటని మొద్దు నాయుడిని ప్రశ్నిస్తే దూషిస్తున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతే దేశానికి వెన్నెముక: ఎమ్మెల్యే జగన్మోహన్


డ్రోన్‌ను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి వెన్నెముక అని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం చీలాపల్లె, పేయన్నపల్లె, మొగరాలపల్లె, శ్రీరంగంపల్లె, బసవాపల్లె, కొత్తపల్లె గ్రామ పంచాయతీల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థికఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడం కూటమి ప్రభుత్వానికే సాధ్యం అన్నారు. అనంతరం శ్రీరంగంపల్లెలో ఎరువులు పిచికారీ చేసుకోవడానికి రైతులకు రాయితీతో అందిన డ్రోన్‌ను ప్రారంభించారు. యువతకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. బస్సు సౌకర్యం, పింఛన్లు, రేషన్‌కార్డులు, సీసీరోడ్లు, కాలువలు తదితర సమస్యలను స్థానికులు విన్నవించగా, పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, చిత్తూరు పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్, నేతలు చెన్నకేశవులనాయుడు, బాలాజీనాయుడు, అరుణ్, జయచంద్రనాయుడు, రవి, హరి, ఉదయ, సుమతి, సురేష్, పూర్ణచంద్ర, రాజేష్, కిట్టు, ప్రతాప్‌నాయుడు, చంద్రమోహన్, చల్లా బాబు, కుమార్ పాల్గొన్నారు.

అలరించిన 'రామాయణ సౌండ్ అండ్ లైట్ షో'




ప్రదర్శనను వీక్షిస్తున్న నగరవాసులు

చిత్తూరు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాగయ్య కళాక్షేత్రంలో శనివారం నటరాజ నాట్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీమద్ రామాయణం సౌండ్ అండ్ లైట్ షో నగరవాసులను అలరించింది. ప్రముఖ నాట్యాచారుడు కోడి కిషోర్ ఆధ్వర్యంలో 20 మంది కళాకారులు రామాయణంలోని బాల కాండం, శివధనుర్భంగం - సీతా కల్యాణం, వనవాసం, పాదుకా పట్టాభిషేకం, కిష్కింధకాండ - వాలి వధ, లంకా దహనం, రామ రావణ యుద్ధం, సీతా అగ్నిప్రవేశం, శ్రీరామ పట్టాభిషేకం తదితర ఘట్టాలను కనువిందుగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ప్రముఖ పారిశ్రామిక వేత్త, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఓం కేశవ రెడ్డి, సామాజిక కార్యకర్త పార్థసారథి నాయుడు ప్రారంభించారు. ప్రదర్శన తర్వాత కళాకారులను పలు కళాసంస్థలు, ప్రముఖులు సత్కరించారు.

బంగారు కుటుంబాలపై రీసర్వే

పాలసముద్రం, జూలై26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపికైన బంగారు కుటుంబ సభ్యుల అవసరాలు గుర్తించడానికి రీసర్వేని శనివారం ఎస్ఆర్ఆర్ కండ్రిగలో నిర్వహించారు. ఎంపీడీవో సతీష్, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: బంగారు కుటుంబాల దత్తతపై నగరి ఎంపీడీవో కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, డీలర్లతో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో కృష్ణయ్య శనివారం సమీక్షించారు. అర్హులను గుర్తించాలన్నారు.

నింద్ర: ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పీ4పై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి చేయండి

● చంద్రశేఖరపురం సింగిల్‌విండో నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే సూచన


సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కృషి చేయాలని చంద్రశేఖరపురం సింగిల్‌విండో నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. శనివారం నూతన చైర్మన్‌గా హేమచంద్రనాయుడితో, డైరెక్టర్లుగా హరిప్రసాద్, దేవయానితో ఆయన ప్రమాణస్వీకారం చేయించి, ప్రసంగించారు. టీడీపీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చారని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాణస్వీకారోత్సవానికి టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్సీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎస్సీ జయప్రకాష్, నాయకులు జయచంద్రనాయుడు, కోదండయాదవ్, జనార్ధన్‌గౌడ్, కోకా ప్రకాష్‌నాయుడు, ఎస్ఆర్‌ఐ విక్రమ్, బుసా నాగరాజు, ఎస్సీ పృథ్వీ, ఆరీఫ్, సర్దార్‌తో పాటు మండల నుంచి అధిక సంఖ్యలో రైతులు, టీడీపీ కార్యకర్తలు హాజరయ్యారు.

'ఓపెన్ స్కూల్'పై అవగాహన ర్యాలీ



నగరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ విద్యపై నగరి ఎమ్మార్సీ కేంద్రం నుంచి తిరుపతి - చెన్నై జాతీయ రహదారి వరకు విద్యాశాఖ అధికారులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరి ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయ మాట్లాడుతూ.. పలు కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారు టెన్త్, ఇంటర్ చదవడానికి చక్కని అవకాశమని చెప్పారు. గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి వైర్ల చోరీ


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

వెదురుకుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం సీడీకండ్రిగకు చెందిన ఎస్.వెంకటముని వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని రాగి వైర్లను చోరీ చేశారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశామని బాధితుడి తెలిపారు.

సన్మానం



గంగాధరనెల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ఎర్రగుంట్ల కృష్ణమనాయుడిని శనివారం చిత్తూరులోని స్వగృహంలో సన్మానించారు. జిల్లా ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు అన్నామలై, సింగిల్‌విండో మాజీ వైస్‌చైర్మన్ బాబునాయుడు, ఫీల్డ్‌అసిస్టెంట్లు మురళి, కర్ణ, మురుగేష్, సురేంద్ర, రూబన్, నాగరాజు, మునస్వామి, రామలింగం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరంగరాజపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం దిగువ పాపిరెడ్డిపల్లెలో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌సీ రాధిక, టీచర్ పవిత్ర, సిబ్బంది చిట్టెమ్మ, సరస్వతి, సుమతి, గిరి, గోపి పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నగరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు జ్యోతినాయుడు, గుణశేఖర్ తెలిపారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఓంశక్తి ఆలయ సమీపంలోని 26వ వార్డులో శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మనోహర్ నాయుడు, ఎం.వి.శ్రీనివాసులు, అశోక్ రాయల్, శివ, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలించిన ఆర్డీవో


భూముల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో అనుపమ

వెదురుకుప్పం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్న భూములను శనివారం నగరి ఆర్డీవో అనుపమ పరిశీలించారు. రెవెన్యూ ఉద్యోగులతో కలసి కార్వేటినగరం, కొల్లాగుంట వద్ద భూముల వివరాలను తెలుసుకున్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

గంగాధరనెల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాపై గంగాధర నెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో శనివారం ఉదయం నియోజకవర్గ ఎన్నికల ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వెంకటశివ సమీక్షించారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ.. ఏ పోలింగ్ కేంద్రంలో అయినా 1200 మంది ఓటర్లు కంటే ఎక్కువగా ఉంటే వాటిని రెండుగా విభజించనున్నట్లు చెప్పారు. పూర్తిగా దెబ్బతిన్న పోలింగ్ కేంద్రాల భవనాలను నియోజకవర్గంలో రెండింటిని గుర్తించామని తెలిపారు. తహసీల్దార్లు శ్రీనివాసులు, అణకుమారి, లోకనాథ పిళ్లై, యువ మోర్చా జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, పెనుమూరు జనసేన కన్వీనర్ శ్రీనివాసులు, గంగాధరనెల్లూరు, ఎస్ఆర్‌పురం మండలాల వైసీపీ కన్వీనర్లు వెంకటరెడ్డి, మణి పాల్గొన్నారు. కాగా, టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ, బీఎస్పీ, కమ్యూనిస్టులకు చెందిన పార్టీ అధ్యక్షులు 35మందికిగాను నలుగురు మాత్రమే హాజరయ్యారు.

నా పొలానికి దారి వసతి కల్పించండి

● కేజీకుప్పం వాసి వినతి


దారి లేకుండా తవ్వేసిన దృశ్యం

నగరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తన పొలానికి దారి వసతి కల్పించాలని ఓజీకుప్పం పంచాయతీలోని కేజీకుప్పం గ్రామస్తుడు రాజేంద్రయాదవ్ విన్నవిస్తున్నాడు. 24 ఏళ్ల కిందట తాను పొలం కొన్నానని, అప్పటి నుంచి సర్వే నెంబరు 76లో ఉన్న పోరంబోకు స్థలాన్ని దారిగా ఉపయోగిస్తున్నానని తెలిపాడు. ఈ పోరంబోకు స్థలంలో ఏడాది కిందట చౌక చెట్లను తన పొలానికి పక్కన ఉన్న రైతు పెట్టడంతో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నానని చెప్పాడు. దాంతో స్థానిక తహసీల్దార్, సర్వేయర్ వచ్చి సర్వే చేసి.. పోరంబోకు స్థలంలో రాకపోకలు సాగించుకోవచ్చని తనకు సూచించారన్నారు. రెండు నెలల కిందట ఈ స్థలంలో దారిని ఏర్పాటు చేసుకున్నానన్నారు. ఈ దారిని ఈనెల 25వ తేదీన ఎక్స్‌కవేటర్ సాయంతో పక్క పొలం రైతు తవ్వేశారని ఆరోపించాడు. దీనివల్ల తన భూమిని బీడు పెట్టుకోవాల్సి వస్తోందని, న్యాయం చేయాలని కోరాడు. దీనిపై తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ కోరగా.. రైతులిద్దరూ కలిసి మెలిసి పోతే సమస్య లేదన్నారు. అలా కాకుంటే మాత్రం పోరంబోకు భూమిలోని చెట్లను, బోర్లను సీజ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

సంక్షిప్తంగా..

పాలసముద్రం రీసర్వే డీటీగా అశోక్‌కుమార్

పాలసముద్రం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండల రీసర్వే డీటీగా అశోక్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రామకుప్పం మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన ప్రవీణ్‌కుమార్ పులిచెర్ల మండలానికి బదిలీపై వెళ్లారు.

నిరాశ్రయులకు వైద్యపరీక్షలు



చిత్తూరు అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం మెప్మా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్టు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రైమరీ హెల్త్ డాక్టర్ మీనాక్షి తన వైద్య సిబ్బందితో వచ్చి పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జోసఫ్‌రాజ్, సూపర్‌వైజర్ పవనమ్మ, ఏఎన్ఎంలు కవిత, రేవతి, స్టాఫ్‌నర్స్ లతమ్మ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కామాఖ్య అమ్మవారి ఆలయ అర్చకులు



ఐరాల(కాణిపాకం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): అస్సాం రాష్ట్రంలోని కామాఖ్య అమ్మవారి ఆలయ అర్చకులు దీక్షిత్ పండిట్ బృందం శనివారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకుంది. వీరిని ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో చిరు జల్లులు


రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దాదాపు అర గంటసేపు కురిసిన చిరు జల్లులతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో జనం అసౌకర్యానికి గురయ్యారు. పొన్నియమ్మగుడి, చర్చి, బజారు వీధుల్లో చిరువ్యాపారులకు ఇబ్బందులు తప్పలేదు.

ప్రజలకు తొలగిన కష్టాలు: టీడీపీ


నరసింహాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో ప్రజల కష్టాలు తొలగి, సుఖంగా ఉన్నారని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి వాసునాయుడు అన్నారు. శనివారం నరసింహాపురంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రాజేంద్రన్, దామురెడ్డి, మోహన్, చిరంజీవి, పయణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేటమిట్టలో 'సుపరిపాలనలో తొలి అడుగు'


వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న జయచంద్ర నాయుడు

పూతలపట్టు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పేటమిట్ట గ్రామంలో శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం టీడీపీ నేత జయచంద్ర నాయుడు, గల్లా హరిబాబు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.